

'పంచ్' కొడితే..

అఖిల భారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీలు రైల్వేస్టేడియంలో సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఆ దృశ్యాలివి. –న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

దారులపై రక్తధార!!




నగరంలో రోడ్డు ప్రమాదాలతో కలవరం

ఏటా 300 మందికి పైగా మృత్యువాత

అతివేగం, మత్తు, నిర్లక్ష్యమే ప్రధాన కారణాలు

'బ్లాక్ స్పాట్స్'పై సమన్వయం లేని శాఖలు



మత్తు

బీచ్ రోడ్డులో ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ఓ రోజు రాత్రి మద్యం మత్తులో కారు నడపడంతో అదుపుతప్పి డివైడర్ దూకి ఆవలి వైపున్న రోడ్డు మీదికి దూసుకెళ్లింది. అపై ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరితోపాటు, కారులో ఉన్న ఇద్దరు యువకులతో కలిపి మొత్తంగా నలుగురు మృతి చెందారు.

అతివేగం

ఇటీవల బీఆర్‌టీఎస్ రహదారిలో ఐటీఐ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో అదుపుతప్పి తలకు గాయాలై ఓ యువకుడు మృతి చెందాడు. కొన్ని రోజుల క్రితం అతివేగం అదుపు చేయలేక ఎన్ఏడీ, తెలుగుతల్లి వంతెనపై నుంచి ద్విచక్ర వాహనాలతో సహా కిందికి పడిన ఘటనల్లోనూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

నిర్లక్ష్యం

కొద్ది రోజుల కిందట భీమిలి నారాయణరాజుపేటలో ఓ ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా టైర్ల కింద పడి ఐదేళ్ల బాలుడు దుర్మరణం పాలయ్యాడు. 2023 నవంబరులో ద్వారకా నగర్ వద్ద సిగ్నల్ పనిచేయని సమయంలో.. విద్యార్థులతో ఆటో వేగంగా రాగా... లారీ ఢీకొట్టిన ఘటన తీవ్ర కలకలం రేపింది.

ఈనాడు–విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

రోడ్డు ప్రమాదాలతో విశాఖ నగరం వణికిపోతోంది. నిత్యం నెత్తురోడుతోన్న రహదారులను చూసి ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. గంజాయి, మద్యం మత్తు, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. సరాసరిన రోజుకు ఒకరిద్దరి ప్రాణాలు గాల్లో కలుస్తుండటం కలవరపెడుతోంది.

ప్రమాదాలకు కారణాలివే..

- పగటి వేళల్లో భారీ వాహనాలు నగరంలోకి రావడం.
- కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయక, కానిస్టేబుళ్లు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహన చోదకులు దూసుకెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.
- మద్యం మత్తు గుర్తించే బ్రీత్ అనలైజర్స్ తనిఖీలు చాలా చోట్ల కేవలం ద్విచక్ర వాహనాలకే పరిమితం చేస్తున్నారు.
- నగరంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో గుంతల్లో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రధాన మార్గాల్లోని గోతులూ ప్రమాదాలకు హేతువవుతున్నాయి.



జాతీయ రహదారిపై ప్రమాదం

నగరంలో...

చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి: 75 కి.మీ.

బీఆర్టీఎస్ రహదారి: 35 కి.మీ.పైగా

నగరంలో అంతర్గత ప్రధాన రహదారులు: 150 కి.మీ. మేర

ప్రతి రోజూ తిరిగే వాహనాలు: 5 లక్షలకుపైగా..



అందరూ దృష్టిసారించేదెప్పుడు..?: నగర కమిషనరేట్ పరిధిలో అత్యధిక సంఖ్యలో ప్రమాదాలు జరిగే 'బ్లాక్‌స్పాట్స్' 68 వరకు గతంలో గుర్తించారు. అత్యధికంగా గాజువాక పరిధిలో ఉన్నాయి. ప్రధానంగా పారిశ్రామిక ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, జాతీయ రహదారికి ఆనుకుని నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు కూడా ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నవిగా తేల్చారు. తెలుగుతల్లి పైవంతెనపై రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో 60 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వాహనం నడిపితే ప్రమాదాలు జరుగుతున్నట్లు స్పష్టమైంది. ఇలా గుర్తించిన సాంకేతిక పరమైన అంశాలను జీవీఎంసీ, ఎన్‌హెచ్, పోలీసు శాఖలు సమన్వయంగా పరిష్కరించాల్సి ఉన్నా ఆశించినంత కసరత్తు కనిపించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

ఆయువు తీసిన వేగం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

6లో

కార్పొరేషన్ల సభ్యులుగా ముగ్గురికి అవకాశం



దాసరి శ్రీనివాస్ | వి. శ్రీనివాస్ | దుర్గాప్రశాంతి

ఈనాడు–విశాఖపట్నం: వివిధ కార్పొరేషన్లకు నామినేటెడ్ పదవులను ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అందులో రెండు కార్పొరేషన్లకు విశాఖ జిల్లా నుంచి ముగ్గురిని సభ్యులుగా ఎంపిక చేశారు. పద్మశాలి సంక్షేమాభివృద్ధి సంఘం సభ్యులుగా భీమిలి నియోజకవర్గం పరిధిలోని 6వ వార్డు తెదేపా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్‌ను నియమించారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా విశాఖ తూర్పు, పశ్చిమం నియోజకవర్గాల నుంచి వెంగమాంబ శ్రీనివాస్ (భాజపా), ఎ.దుర్గా ప్రశాంతి (జనసేన)ని నియమించారు. ● దాసరి శ్రీనివాస్ గత నాలుగేళ్లుగా 6వ వార్డు తెదేపా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా మూడేళ్లుగా చేస్తున్నారు. గత ఎన్నికల్లో నగరంలోని 35 వార్డులకు క్లస్టర్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. దుర్గాప్రశాంతి పశ్చిమ నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి. సాధారణ కార్యకర్తలకు పదవులు వరించడంపై కూటమి అభిమానుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

వాడీవేడి చర్చ..
అవినీతిపై నిలదీత..

- నినాదాలతో హోరెత్తిన కౌన్సిల్
- సమావేశం నేటికి వాయిదా



మేయరు పోడియం ముందు బైఠాయించిన కూటమి కార్పొరేటర్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహావిశాఖ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం వాడీవేడిగా కొనసాగింది. కూటమి కార్పొరేటర్లు మేయర్‌పై అవినీతి ఆరోపణలు చేయడంతోపాటు ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సమావేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమావేశంలో ముందుగా సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి మృతికి, కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి మృతికి సభ్యులు సంతాపం తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభ రవిబాబు, పండుల రవీంద్రబాబు, ఎంపీ గొల్ల బాబూరావు, దక్షిణం, ఉత్తరం ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు హాజరయ్యారు.

● ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ 'విశాఖ నగరంలో వీధి దీపాలు వెలగడంలేదు. వీధుల్లో చీకట్లు అలముకుంటున్నాయి. మూడేళ్లయినా గుత్తేదారు వైఖరిలో మార్పు రావడం లేదు. తక్షణమే గుత్తేదారుతో ఒప్పందాన్ని రద్దు చేసి జోన్ల వారీగా నిర్వహణ టెండర్లు అప్పగించాల'ని కోరారు.

ఆస్తిపన్నుపై వాగ్వాదం: స్టీల్‌ప్లాంటు ప్రయివేటీకరణపై సీఎం, డిప్యూటీ సీఎం ఉక్కు మంత్రిని కలిసేలా తీర్మానం చేయాలని సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు స్టాలిన్, గంగారావు డిమాండ్ చేశారు. చెత్త ఛార్జీల రద్దు, పాత విధానంలో ఆస్తి పన్ను విధింపు చేయాలని కోరారు. దీంతో ఆయా అంశాలను టేబుల్ అజెండాగా తయారు చేయాలని మేయర్ ఆదేశాలు జారీ చేశారు. ఇంతలో వైకాపా నాయకులు ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, పంతం నానాజీలపై చర్యలు చేపట్టాలని నినదించారు. వైకాపా హయాంలో ఆస్తి పన్ను మదింపు, చెత్త ఛార్జీలపై చేసిన తీర్మానాలను బయట పెట్టాలని తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చేతకాక తమపై నిందలు వేస్తారా అని మేయరును ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైకాపా, కూటమి కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

కోళ్ల వ్యర్థాల తరలింపులో అక్రమాలు..: కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు వెళ్లాల్సిన కోళ్ల వ్యర్థాలు చేపల చెరువులకు వెళుతున్నాయని 45వ వార్డు కంపా హనోక్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలలో వైకాపా నాయకులు రూ.కోట్లు కొట్టేశారని ఆరోపించారు. వైకాపాలో ఉన్నంత కాలం తనను మాట్లాడనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ వైకాపా హయాంలో దళితులపై జరిగిన దాడులను వివరించారు.

హాజరుకాని తెదేపా ఎమ్మెల్యేలు: దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కార్పొరేటర్‌గా, ఎమ్మెల్సీగా ఇప్పటి వరకు సభకు హాజరుకాగా, ఎమ్మెల్యేగా తొలిసారి హాజరయ్యారు. గతంలో మేయరుగా గొలగాని హరి వెంకట కుమారిని ప్రతిపాదించినప్పుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సమావేశానికి వచ్చారు. తిరిగి ప్రతిపక్షంలో ఉండగా మళ్లీ వచ్చారు. తెదేపా ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరుకాలేదు.

మేయర్ రాజీనామాకు డిమాండ్

జీవీఎంసీ అధికారి నుంచి మేయరు లంచం తీసుకున్నారని తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆరోపించారు. అలాగే కొన్ని ఆధారాలు చూపించారు. 'కరోనా సమయంలో మాస్కులు, ఇతర అవసరాల కోసం జీవీఎంసీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జీవీఎంసీలోని ఓ ఉన్నతాధికారి అందులో భారీ అవకతవకలకు పాల్పడ్డారు. అంతేకాకుండా పిక్నిక్‌ల పేరిట మహిళా సంఘాల సభ్యుల నుంచి రూ.5కోట్ల మేర అక్రమంగా వసూలు చేశారు. ఈ విషయాలు బయటకు రాకుండా ఉండడానికి ఆ అధికారి ఒక కమిషనర్‌కు రూ.10లక్షలు, మేయరుకు రూ.10 లక్షలు, అప్పటి మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శికి రూ.5లక్షలు లంచం ఇచ్చినట్లు నాడు విశాఖ వైకాపా కార్యాలయం నుంచి తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి ఫిర్యాదు లేఖ వెళ్లింది' అని పేర్కొన్నారు. దీంతో ఆమె పదవిని విడనాడాలని కూటమి కార్పొరేటర్లు పోడియం వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ కలెక్టర్ నేతృత్వంలో విచారణ జరుపుతామని ప్రకటించినా శాంతించలేదు. విచారణను స్వాగతిస్తున్నామని మేయరు చెప్పినా ఆందోళన కొనసాగించారు. పోడియం ముందు బైఠాయించగా ఉప మేయరు జియ్యాని శ్రీధర్, వైకాపా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్, చెన్నా జానకీరామ్ వారిని అడ్డుకున్నారు. మిగతా వైకాపా కార్పొరేటర్లు స్పందించలేదు. దీంతో మేయర్ సమావేశాన్ని బుధవారానికి వాయిదా వేశారు. ఆరోపణల నేపథ్యంలో కూటమి ఎమ్మెల్యేలు మేయర్‌తో మాట్లాడారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా



మేయరుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్

ఉక్కులో ప్రమాదం
అధికారికి తీవ్ర గాయాలు

ఉక్కునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ఎస్ఎంఎస్-1(స్టీల్ మెల్టింగ్ షాప్-1) లాడిల్ ప్రిపరేషన్ బే(ఎల్‌పీ బే)లో మంగళవారం జరిగిన ప్రమాదంలో సీనియర్ మేనేజర్ సీహెచ్.మల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కార్మిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం... కంట్రోల్ రూమ్‌లో పని చేసే ఉద్యోగి హాజరు కాకపోవడంతో, ఉదయం ఏ-షిఫ్ట్ విధులకు వెళ్లిన మల్లేశ్వరరావు అక్కడి పనులు పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బ్లాస్ట్‌ఫర్నేస్ నుంచి హాట్‌మెటల్ (సుమారు 1500 డిగ్రీల వేడితో) ఎస్ఎంఎస్‌కు వచ్చింది. ట్రాన్స్‌ఫర్ కార్ నుంచి నేరుగా కన్వర్టర్‌లో పోసిన మెటల్‌కు వివిధ మిశ్రమాలు కలిపారు. తర్వాత లాడిల్‌లో పోసి మౌల్డింగ్ యూనిట్‌కు తరలించే క్రమంలో మెటల్ ఒక్కసారిగా పేలిపోయింది. భారీ శబ్దం రావడంతో ఏం జరిగిందోనని... కంట్రోల్ రూమ్‌లో ఉన్న మల్లేశ్వరరావు బయటకు వస్తుండగా... కాలికి ఇనుప రాడ్డు తగిలి కింద పడిపోయారు. పేలిన హాట్ మెటల్ ఆయనపై పడడంతో 90 శాతంపైగా శరీరం కాలిపోయింది. తోటి కార్మికులు వెంటనే స్టీల్ జనరల్ ఆసుపత్రికి, అక్కడ నుంచి నగరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉక్కు అధికారులు సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు.





ఎస్ఎంఎస్-1లో ప్రమాద దృశ్యం, అంతర చిత్రంలో మల్లేశ్వరరావు (పాతచిత్రం)

పీపీపీ భాగస్వామ్యంతో వాతావరణ అంచనాలు మెరుగు
ఐఎండీ, సీడబ్ల్యూసీకి అభినందనలు: కలెక్టర్



స్వర్ణోత్సవ సావనీర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఐఎండీ డీజీ ఎం.మహాపాత్రో, ఏయూ వీసీ శశిభూషణరావు, తదితరులు

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం: ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల (పీపీపీ) భాగస్వామ్యంతో వాతావరణ అంచనాలు మెరుగుపరచడంతోపాటు ప్రతి ఒక్కరికీ సమాచారం చేరవేయొచ్చని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం (సీడబ్ల్యూసీ) ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దీర్ఘకాలంగా వర్షాలు, తుపాన్లు, వడగాలులపై ప్రజలను అప్రమత్తం చేస్తున్న భారత వాతావరణ శాఖ (ఐఎండీ), సీడబ్ల్యూసీని అభినందించారు. 'ఆర్థిక, సామాజిక మార్పులు, ప్రజల రోజువారీ జీవన విధానం వాతావరణంతో ముడిపడి ఉన్నాయి. కచ్చితమైన వాతావరణ అంచనాలు, హుటాహుటిన అప్రమత్తం కావడంతో నష్టాలు తగ్గించవచ్చు. జిల్లాలో దాదాపు 14 వేల గృహాలు కొండవాలు ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రమాదాలు పొంచిన ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. ఆక్రమణల కారణంగా విజయవాడలో బుడమేరు తీరని వేదన మిగిల్చింది. ఇప్పటికైనా ఆక్రమణకు గురైన నీటి వనరులను పునరుద్ధరించాలి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలి' అని పేర్కొన్నారు.

● ఐఎండీ డైరెక్టర్ జనరల్ ఎం.మహాపాత్రో మాట్లాడుతూ 1970 దశకంతో పోలిస్తే అధునాతన సాంకేతికత అందుబాటులోకి రావడం, వాతావరణ అంచనాల్లో కచ్చితత్వం పెరగడంతో మరణాల సంఖ్యను తగ్గించామన్నారు. దీర్ఘకాలంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం.. సీడబ్ల్యూసీకి సహకరిస్తుందన్నారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి వాతావరణ అంచనాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ● ఐఎండీ విశ్రాంత డీజీ ఏవీఎం అజిత్ త్యాగి మాట్లాడుతూ వాతావరణ మార్పులు దాదాపు 30 రంగాలపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు. చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ముఖ్య అధికారి డా.ఎస్.బాలచంద్రన్, ఏయూ వీసీ జి.శశిభూషణరావు, సీడబ్ల్యూసీ ముఖ్య అధికారి భారతి శ్రీకాంత్ సాబ్డే తదితరులు ప్రసంగించారు. అనంతరం సీడబ్ల్యూసీ స్వర్ణోత్సవ సావనీర్‌ను ఆవిష్కరించారు.

నేడు హైకోర్టులో కీలక కేసుల విచారణ

ఈనాడు–విశాఖపట్నం: విశాఖకు చెందిన మూడు కీలక కేసులపై అమరావతిలోని హైకోర్టులో బుధవారం విచారణ జరగనుంది. ఎర్రమట్టి దిబ్బలు విధ్వంసం, భీమిలి బిల్డింగ్ సొసైటీకి కేటాయించిన 280 ఎకరాల స్థలం రద్దు చేయాలంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో ఇటీవల పిల్ వేశారు. దీని విచారణ బుధవారం జరగనుంది. అదే డివిజనల్ బెంచ్ కోర్టు నెంబరు-1లో.. భీమిలి తీరంలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా కట్టిన నిర్మాణాలపై వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ కొనసాగనుంది. కోర్టు ఆదేశాలతో గత కొన్ని రోజులుగా జీవీఎంసీ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చుతున్న సంగతి విదితమే. ఇప్పటి వరకు జీవీఎంసీ భీమిలిలో నేహారెడ్డి నిర్మాణాలపై తీసుకున్న చర్యలేంటనేది నేడు కోర్టుకు నివేదించాల్సి ఉంది. ఈ రెండు కేసులతోపాటు.. కైలాస గిరి కొండ కింద పార్కింగ్ ఏరియాలో నిర్మాణాలపై మూర్తియాదవ్ వేసిన మరో కేసు విచారణ కూడా జరగనుంది.

డీఎల్ఎస్ఏలో ఇంటర్వ్యూలు 30కి వాయిదా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)లో ఈనెల 26, 27 తేదీల్లో ఆఫీసు అసిస్టెంట్(03), రిసెప్షనిస్ట్ కమ్ డేటా ఎంట్రీఆపరేటర్ (01), ఆఫీసు సబార్డినేట్ (03) ఉద్యోగాలకు జరగాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయని జిల్లా న్యాయసేవల సాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలను ఈనెల 30న సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిమిత్తం అభ్యర్థులు అదే రోజు మధ్యాహ్నం 3గంటలలోపు జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్‌కు చేరుకోవాలని సూచించారు.

సింహాచలంలో సంప్రదాయబద్ధంగా శాంతి హోమం
ఆలయం, ప్రసాదాల తయారీ కేంద్రంలో సంప్రోక్షణ



ప్రసాదాల తయారీ కేంద్రాన్ని పవిత్ర జలాలతో ప్రోక్షణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానంలో ప్రసాదాల తయారీ, దైవారాధనకు ఉపయోగిస్తున్న నెయ్యిలో కల్తీ జరిగిందన్న అనుమానాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ ఆదేశాల మేరకు మంగళవారం అప్పన్న ఆలయంలో శాంతి హోమం, సంప్రోక్షణ కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వేకువజామున ఆలయ సంప్రోక్షణ, హోమం నిర్వహించారు. పంచగవ్యాలతో స్వామివారి ప్రధాన ఆలయం, పరిసరాలను శుద్ధి చేశారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో శాంతి హోమం, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పుణ్యాహవాచనం జలాల కలశాన్ని శిరస్సున ధరించి బేడామండపం ప్రదక్షిణ తర్వాత అంతరాలయంలో స్వామికి సమర్పించారు. అనంతరం పవిత్ర జలాలను ఆలయ పరిసరాలు, అన్నప్రసాద భవనం, ప్రసాదాల తయారీ కేంద్రంతో పాటు దినుసులు, వంటపాత్రలపై ప్రోక్షణ చేసి శుద్ధి చేశారు. భీమిలి, పెందుర్తి, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, గణబాబు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇది గత పాలకుల తప్పిదాలకు పరిహారం
గంటా శ్రీనివాసరావు



పవిత్ర జల కలశంతో అర్చకులు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.గణబాబు

'భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా గత వైకాపా ప్రభుత్వం వ్యవహరించింది. తిరుమల శ్రీవారి లడ్డూ అంటే స్వయంగా స్వామితో సమానంగా భక్తులు భావిస్తారు. అలాంటి ప్రసాదం విషయంలో గత పాలకులు చేసిన తప్పిదాలకు పరిహారంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన దేవాలయాల్లో ఈ సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టాం' అని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శాంతి హోమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ మాయతో దేవాలయాలను భ్రష్టు పట్టించిందన్నారు. తిరుమలతో పాటు సింహాచలం దేవస్థానంలోనూ నెయ్యి కల్తీ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వై.వి.సుబ్బారెడ్డి, పొన్నవోలు సుధాకర్ వంటి విలువలు లేని వారికి అధికారం కట్టబెట్టి గత ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని వ్యాఖ్యానించారు.

27న యాత్రీ నివాస్ పునఃప్రారంభం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆధునికీకరించిన యాత్రీ నివాస్ (హరిత హోటల్)ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 27న ఆన్‌లైన్ విధానంలో పునఃప్రారంభించనున్నారు. అప్పుఘర్ దరి వద్ద ఈ హోటల్ ఉంది.

ఆయువు తీసిన వేగం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

మాధవధార, న్యూస్‌టుడే

ఎక్కువ సీసీ సామర్థ్యం కలిగిన వాహనాన్ని నిలువరించ లేకపోవడం, అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు తీసింది. విశాఖ నగరంలో మంగళవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ సీతంపేట ప్రాంతానికి చెందిన గరుగుబెల్లి ముకుల్‌సాయి ప్రవీణ్ (20) బెహర కాలేజీలో డిప్లొమో చివరి సంవత్సరం చదువుతున్నాడు. అతడి తల్లిదండ్రులు ఊరు వెళుతుండటంతో దొండపర్తి ప్రాంతానికి చెందిన స్నేహితుడు దువ్వపు ప్రశాంత్ (20)తో కలిసి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో వెల్ఫేర్ కాలేజీలో డిప్లొమో చదువుతున్న మరో స్నేహితుడు నడగాన మహేష్ (20)కోసం కప్పరాడ వెళ్లారు. వీరు ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై ప్రవీణ్ ఇంటికి బయలు దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేగంగా వెళ్తుండగా తాటిచెట్లపాలెం సమీపంలో సంజీవయ్యనగర్ వద్ద ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో ముగ్గురు ఒక్కసారిగా మూడు వైపులా తుళ్లిపోయారు. డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్ గుండె, తలపై, మధ్యలో కూర్చున్న ప్రశాంత్ తలకు బలంగా గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చివర కూర్చున్న మహేష్ మరో వైపు తుళ్లిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం సంఘటన ప్రదేశం నుంచి 300 మీటర్ల దూరం వెళ్లి ఆగింది. స్థానికులు గాయాలైన మహేష్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. సంఘటన ప్రాంతానికి చేరుకున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ఎ.దాశరథి ప్రమాద కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముకుల్ సాయి ప్రవీణ్, ప్రశాంత్ (పాతచిత్రాలు)


తీవ్ర గాయాలైన మహేష్


సంఘటన ప్రాంతంలో పల్టీ కొట్టిన బైక్

అతి వేగమే ప్రమాదానికి కారణం

ఉదయం పూట జాతీయ రహదారి ఖాళీగా ఉండటంతో అతి వేగంగా డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రవీణ్ 400 సీసీ బైక్‌ను అతి వేగంగా నడిపి, కంట్రోల్ చేయలేక అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. ఇటువంటి బైక్‌లు నడిపేటప్పుడు వాహనంపై అవగాహనతో పాటు, వేగంగా వెళ్లేటప్పుడు కంట్రోల్ చేసే పద్ధతి తెలిసి ఉండాలి. కానీ, కొత్తగా కొనుగోలు చేసిన బైక్‌పై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో, వాహనాన్ని అదుపు చేయలేక ఈ ప్రమాదం సంభవించినట్లుగా పోలీసులు చెబుతున్నారు.

తండ్రి వారించినా..

ప్రవీణ్ తండ్రి లక్ష్మణరావు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి. నెల రోజుల క్రితమే కుమారుడికి ఆయన 400 సీసీ బైక్‌ను కొనుగోలు చేశారు. తండ్రి బైక్ వద్దని ఎంత వారించినప్పటికీ ఇంట్లో తల్లి, కుమారుడు ఒప్పుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రూ.3.50 లక్షలతో కొనుగోలు చేశారు. ఇలా ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సంఘటన ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు

జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద ప్రాంతాన్ని ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు శ్రీరాం, ఇంజినీరింగ్ విభాగం అధికారి కరీం పరిశీలించారు. ప్రమాదం జరిగిన చోట జాతీయ రహదారిలో మలుపు ఉంది. దీంతో ప్రమాదం ఏవిధంగా జరిగింది, ఆ ప్రాంతంలో ఎటువంటి సమస్యలున్నాయో గుర్తించారు. జాతీయ రహదారిలో కప్పరాడ, సంజీవయ్య కాలనీ పరిసర ప్రాంతాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోనున్నారు.

సాంకేతిక సదస్సులతో ప్రయోజనాలు

సింధియా, న్యూస్‌టుడే: సాంకేతిక సదస్సుల నిర్వహణతో అనేక అంశాలపై అవగాహన ఏర్పడి, ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయని తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్, వైస్ అడ్మిరల్ సమీర్‌సక్సేనా అన్నారు. మంగళవారం తూర్పు నౌకాదళం కార్యాలయంలో 'భవిష్యత్తు శ్రేణి- నెట్‌వర్క్' అనే అంశంపై జరిగిన సాంకేతిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రహస్య గూఢచారి లిపి, కృత్రిమ మేధ(ఏఐ), వినూత్న ఆవిష్కరణలు, సమాచార మార్పిడి వంటి అంశాలు రాబోయే తరంలో అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం డిజిటల్ వర్క్, 6జీ కమ్యూనికేషన్ వంటి అంశాలపై 500 మంది నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారని, సదస్సులో ప్రత్యేక మ్యాగజైన్ విడుదల చేసినట్టు నేవీ వర్గాలు పేర్కొన్నాయి.


మ్యాగజైన్ విడుదల చేస్తున్న వైస్‌అడ్మిరల్ సమీర్‌సక్సేనా, ఇతర అధికారులు

వరద బాధితులకు రూ.2.71లక్షల వితరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం తెదేపా విశాఖ న్యాయ విభాగం అధ్యక్షుడు బత్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో విభాగ సభ్యులు, తెదేపా అభిమాన న్యాయవాదులు రూ.2,71,116 విరాళాలు ఇచ్చారు. ఆ మొత్తానికి సంబంధించిన డీడీని మంగళవారం ఎంపీ శ్రీభరత్‌కు అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ న్యాయవాదులు సమ సమాజ స్థాపనకు న్యాయ పోరాటాలు చేయడమే కాకుండా, విపత్తుల సమయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. తెదేపా విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, కార్యదర్శి పోల మరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు ఎస్ఏ రహమాన్, ఎస్.సతీష్, గొంప సత్యనారాయణ, బి.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ శ్రీభరత్‌కు డీడీ అందిస్తున్న తెదేపా న్యాయ విభాగ నాయకులు

పంచ్‌ల పోరుకు సై..!

అఖిలభారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీలు ప్రారంభం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: పంచ్‌లతో పోరుకు బాక్సర్లు సిద్ధమయ్యారు. 78వ పురుషుల, 17వ మహిళల అఖిల భారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీలు రైల్వేస్టేడియంలో సమీపంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. 14 రైల్వే జోన్ల నుంచి మొత్తం 124 మంది బాక్సర్లు వివిధ కేటగిరీల్లో తలపడుతున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించి పతకాలు గెలుచుకోవాలన్నారు. తూర్పు కోస్తా రైల్వే క్రీడా సంఘం బాక్సింగ్ క్రీడకు మంచి సౌకర్యాలు కల్పించిందని ప్రశంసించారు. తూర్పుకోస్తా రైల్వే మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీప్రసాద్, ఉపాధ్యక్షురాలు మధుమిత సాహు, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, క్రీడాధికారి ప్రవీణ్‌భాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు కె.సందీప్, రైల్వే క్రీడా సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


బౌట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, తదితరులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ఈనెల 27వ తేదీన యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సీతమ్మధార బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులో ఖాళీ పోస్టులు భర్తీచేయటం, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. రాత్రి ఏడు గంటలు దాటినా అధికారులు ఇంటికి వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్నాలో నాయకులు కె.రమేశ్, ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, అధిక సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత నివారణపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, ఆరేళ్లలోపు పిల్లల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు వారికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేసి రక్తహీనతను గుర్తించాలన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పౌష్టికాహార మాసోత్సవాలను స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మహిళల్లో, పుట్టిన బిడ్డల్లో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు లేకుండా రాష్ట్రీయ పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా కృషి చేయాలన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ పౌష్టికాహార మాసోత్సవాలను ప్రతి నెలా నిర్వహించాలని కోరారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారిణి జి.జయలక్ష్మి, సీడబ్ల్యూసీ సభ్యులు రజిని, వైద్యాధికారి డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పలు రైళ్ల రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీషెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్ ఈనెల 24న ఉదయం 8.50గంటలకు బదులు 3.10 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు. ., విశాఖ-సికింద్రాబాద్ (20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 24న మధ్యాహ్నం 2.35 గంటలకు బదులు 1.55 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

సీతంపేట, న్యూస్‌టుడే: అన్ని ప్రభుత్వ, ప్రైవేటు శిక్షణ కేంద్రాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్(ఆడ) కోర్సునకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీని రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి దరఖాస్తులు ఈనెల 30 నాటికి అందించాలి. పూర్తి వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్ cfw.ap.nic.in లో పరిశీలించాలన్నారు.

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీరామ్మూర్తి

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీరామ్మూర్తిని నియమిస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న జయరాజును కడపకు బదిలీ చేశారు. బాపట్ల సెబ్‌లో పని చేస్తున్న మహేశ్‌కుమార్‌ను విశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

జోన్-3 విద్యుత్తు శాఖలో బదిలీలు

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ జోన్-3 ఏపీ విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో పలువురు ఉద్యోగులకు మంగళవారం బదిలీ అయ్యింది. మధురవాడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.అనిల్‌కుమార్ సింహాచలం మీటర్స్ సెక్షన్‌కు బదిలీ కావడంతో ఆ స్థానాన్ని టి.కిరణ్‌కుమార్ (ఆనందపురం) భర్తీ చేయనున్నారు. అనకాపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రాజశేఖర్ ఆనందపురానికి బదిలీ అయ్యారు. మధురవాడ ఉప విద్యుత్తు కేంద్రం ఏఈఈ ఎస్.వి.ఎస్.రామమూర్తికి సిరిపురం బదిలీ కాగా ఆ స్థానంలో జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ విభాగం నుంచి శైలజ రానున్నారు. సాగర్‌నగర్ ఉప విద్యుత్తు కేంద్రం ఏఈఈ ఎం.రాజేష్‌కు మురళీనగర్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఎస్.చక్రవర్తి (సిరిపురం) విధులు చేపట్టనున్నారు.

మాధవపెద్ది సురేష్‌కి బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో యాక్మీ స్వచ్ఛంద సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాల్గో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కార ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎస్పీ బీజిమ్ పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. కళాకారులు పలు సినీగీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. నిర్వాహకులు యాక్మీప్రతాప్, మాజీమంత్రి దాడివీరభద్రరావు, దాడి రత్నాకర్, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాధవపెద్ది సురేష్‌కి బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారం అందజేసి గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఉక్కులో ఇంటర్వ్యూలకు 30 మంది హాజరు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి 500 మంది అధికారులను డిప్యుటేషన్‌పై ఎన్ఎండీసీ అనుబంధ నగర్‌నార్ ఉక్కు కర్మాగారానికి పంపేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా తొలి 100 మంది అధికారులకు సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు కేవలం 30 మంది మాత్రమే హాజరయ్యారు. ఎంపికైన అధికారులు కుటుంబంతో సహా వెళ్తే అక్కడ క్వార్టర్ కేటాయిస్తారు. ఒంటిరిగా వెళ్తే మాత్రం షేర్డ్ క్వార్టర్ ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఒకరు దుర్మరణం చెందిన ఘటనపై దువ్వాడ జీఆర్పీ ఎస్సై లక్ష్మి తెలిపిన వివరాలివి. అగనంపూడి పైవంతెన సమీప రైల్వే ట్రాక్‌పై మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, 5.3 అడుగుల ఎత్తున్న వ్యక్తి తెలుగురంగు బనియన్, తెలుపు, ఎరుపు, నీలం రంగు గీతలున్న లుంగీ ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వివరాలు తెలిసిన వారు 73820 58996 నంబర్‌లో సంప్రదించాలన్నారు. మతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - మత్తువదలరా-2
స్క్రీన్-2 - గొర్రె పురాణం

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ఎంపీడీవో **పి.పద్మజ** మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం. పరవాడ ఈవోపీఆర్‌డీగా పని చేసి పదోన్నతిపై పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లినట్లు ఆమె తెలిపారు. ఇటీవల బదిలీపై సబ్బవరం ఎంపీడీవోగా నియమించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా సబ్బవరం మండలాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

పెందుర్తి

స్పందనకు వందన

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: 97వ వార్డు సుజాతనగర్ దరి వెంకటాద్రినగర్‌లో నెల రోజులుగా వీధిదీపం వెలగడం లేదని 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా'లో మంగళవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ శివ రామ్‌ప్రసాద్.. వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సబ్బవరం, న్యూస్‌టుడే

సమస్య: సబ్బవరం గణేష్ నగర్‌లో చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోయాయి.
– జి. మహేశ్వరరావు గణేష్ నగర్‌కాలనీ సబ్బవరం

సమాధానం: వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకుంటాం. – కె. మూర్తిబాబు, గ్రామ కార్యదర్శి సబ్బవరం

మ్యాన్‌హోల్ పొంగి.. దారులు మునిగి

వేపగుంట, న్యూస్‌టుడే

వేపగుంట పరిసర కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ సంప్‌లు ప్రధాన సమస్యగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు ఎక్కడికక్కడ పొంగిపొర్లుతోంది. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. ఫలితంగా రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి సమస్య వెంటాడుతోంది. ఈ దుస్థితిపై జోనల్ కార్యాలయం, స్థానిక సచివాలయం, ప్రజారోగ్య విభాగానికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరోవైపు అభివృద్ధికి నోచుకోని మట్టి రోడ్లు నారుమడుల్లా మారాయి. వాహనదారులు జారి పడుతున్నారు. రాత్రివేళ అటుగా వెళ్లలేని పరిస్థితి. అధికారులు, పాలకులు తక్షణమే తగు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా రహదారి ఇలా..

ఎక్కడెక్కడ ఎలా అంటే..

★ 94వ వార్డు పురుషోత్తపురంకాలనీ రహదారిలో తొలి మలుపు వద్ద భూగర్భడ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు రావడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు అధికమయ్యాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ★ 95వ వార్డు పురుషోత్తపురం గౌరీవిశ్వేశ్వర కాలనీ ఇళ్లలోని వాడుకనీరు పోయేందుకు సరైన కాలువలు లేకపోవడంతో ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. ఆ మురుగు పోయేందుకు తాత్కాలిక చర్యలైనా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ★ 94వ వార్డు కృష్ణరాయపురం 80 అడుగుల రహదారిలోని పురుషోత్తపురం కాలనీలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. నారుమడుల్లా మారాయి. వాహనదారులు వెళ్లలేకపోతున్నారు.



పురుషోత్తపురం కాలనీ వీధిలో పొంగుతున్న మ్యాన్‌హోల్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కాలనీల్లో సమస్యలను నేరుగా పరిశీలించమని సంబంధిత సచివాలయం కార్యదర్శులకు సూచిస్తాం. ప్రాంతీయులకు అసౌకర్యం కలగకుండా తగు చర్యలు చేపడతాం. – హేమావతి, జోన్–8 జోనల్‌కమిషనరు

పోషకాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలం

పెందుర్తి, న్యూస్‌టుడే: రోజూ పోషకాలతో నిండిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. సీడీపీవో నీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జన ఔషధి కేంద్రం ప్రారంభం: పెందుర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఎం భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొని ప్రారంభించారు. జిల్లా సహకార సంయుక్త రిజిస్ట్రార్ ప్రవీణ, డివిజినల్ అధికారి దుర్గాప్రసాద్, ఆడిట్ అధికారి శ్యామల, డీసీసీబీ సీఈవో డీవీఎస్ శర్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, అధికారులు

వ్యవసాయ పథకాలపై అవగాహన

పెందుర్తి, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ పీడీ ఆశాదేవి సూచించారు. మంగళవారం పెందుర్తి మండలంలోని నరవ గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పెందుర్తి మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు

పరిశ్రమల భద్రతకు పటిష్ఠ ప్రణాళికలు అవసరం

పరవాడ, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో భద్రతకు పటిష్ఠమైన ప్రణాళికలు అమలు చేయాలని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో), ఎల్‌సీజీ ఛైర్మన్ చిన్నికృష్ణ పేర్కొన్నారు. పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ పర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఎఎస్‌ఆర్‌ఎం) భవనంలో మంగళవారం లోకల్ క్రైసిస్ గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో జరిగిన ఘోరప్రమాదం పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే వెంటనే స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వాలని తెలిపారు. కార్మికుల పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.

★ కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ మాట్లాడుతూ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి.. నివేదికలను యాజమాన్యాలు తప్పకుండా అమలు చేయాలన్నారు. మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. కర్మాగారాల ఇన్‌స్పెక్టర్ చిన్నారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి ఆఫ్‌సైట్, ఆన్‌సైట్ అత్యవసర ప్రణాళికలు అమలు చేయాలన్నారు. సిబ్బందికి నైపుణ్య శిక్షణ మరింత మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఎఎస్‌ఆర్‌ఎం జనరల్ సెక్రటరీ జెట్టి సుబ్బారావు, ఎల్‌సీజీ సభ్యులు డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ హనుమంతు లక్ష్మణరావు, రాకేశ్‌కుమార్, 189 మంది పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో, ఎల్‌సీజీ ఛైర్మన్ చిన్నికృష్ణ



హాజరైన కంపెనీ ప్రతినిధులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. పెందుర్తి మండలం వి.జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయుడు ఎస్‌బీవీ.సత్యకుమార్ తెలిపారు. నాయకులు మధపాడ అంజి, బొడ్డు సూర్యప్రకాశ్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పెందుర్తి ఎంపీపీ నాగమణి

విశాఖ బాలుడు.. తిరుపతిలో అప్పగింత

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనం కోసం విశాఖ నుంచి తిరుపతికి వచ్చి ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. తిరుపతి పడమర పీఎస్ ఎస్‌ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ఎం.నిరంజన్‌రావు కుమారుడు సుశాంత్(13) విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం తండ్రి హాస్టల్‌కు వచ్చి కుమారుడిని చూసి కొంత డబ్బు ఇచ్చాడు. సోమవారం ఉదయం తండ్రికి, హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా బాలుడు బయటకు వచ్చాడు. శ్రీవారి దర్శనం చేసుకోవాలని విశాఖపట్టణం రైల్వేస్టేషన్‌కు వెళ్లి తిరుపతికి వచ్చే రైలు ఎక్కాడు. సోమవారం అర్ధరాత్రిపైన తిరుపతికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అలిపిరి చేరుకుని ఒంటరిగా తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. గత నెల కుటుంబంతో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నానని.. మరోసారి తిరుమలకు రావాలనే కోరికతో వచ్చినట్లు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి తండ్రికి సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి తిరుపతికి వచ్చిన తండ్రి నిరంజన్‌రావుకు బాలుడిని అప్పగించారు.

విద్యార్థుల శ్రమదానం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నివేదిత, రత్నప్రకాష్, సత్యనారాయణ, ఎంపీ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పీహెచ్‌సీ అదనపు భవనం ప్రారంభం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థానే రూ.2 కోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం సబ్బవరం పీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల కిందట ఆసుపత్రి సందర్శనకు రాగా.. ప్రారంభానికి అడ్డంకులను తొలగించేందుకు కలెక్టరును, డీఎంఅండ్‌హెచ్‌వోను సంప్రదించి మార్గం సుగమం చేశామన్నారు. ఆదేవిధంగా గతంలో పీహెచ్‌సీ మరమ్మతులకు రూ.కోటి మంజూరు కాగా గుత్తేదారు సుమారు రూ.30 లక్షల మేర పని చేశారన్నారు. ప్రస్తుత భవనం 40 ఏళ్లకు పైబడి శిథిలావస్థలో ఉండటంతో మరమ్మతులకు పనికిరాదని నూతన భవనం నిర్మించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను కోరగా ప్రస్తుతం ఉన్న రూ.70 లక్షలతో పాటు మరో రూ.1.30 కోట్లతో మొత్తం రూ.2 కోట్లు ఇస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. దీంతో త్వరలోనే పాత భవనం స్థానంలో కొత్తది నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

★ స్వర్ణకుంభ శ్రీవారి లడ్డు ఒక ఆదర్శంగా ఉంటుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రత్యక్ష సమావేశంలో చెప్పారు. జంతు సంబంధిత నూనెలు వాడడం అమానుష దుర్మార్గమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సిట్ ఏర్పాటు చేసి నిగ్గు తేలుస్తామనడం, ఉపముఖ్యమంత్రి ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారని తెలిపారు.

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రపంచమంతా ఎంతో విశ్వాసంతో కొలిచే కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీకి పాల్పడి పవిత్రతకు భంగం కలిగించిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. నెయ్యి కల్తీపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మంగళవారం సంఘీభావ దీక్షలో పాల్గొన్నారు. 97వ వార్డు జనసేన అధ్యక్షుడు శానాపతి సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో చినముషిడివాడలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పంచకర్ల పాల్గొన్నారు. తొలుత హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారాన్ని ఖండించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం మండలానికి 6 ట్రాక్టర్లు మంజూరు

సబ్బవరం, న్యూస్‌టుడే: సచ్ఛభారత్ మిషన్ కింద సబ్బవరం మండలానికి రూ.36,11,766 నిధులతో 6 ట్రాక్టర్లు మంజూరైనట్లు సబ్బవరం ఈవోపీఆర్‌డీ ఒ.మహేష్ తెలిపారు. వీటిలో గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, అసకపల్లి, మొగలిపురం, అంతకాపల్లి, ఆరిపాక గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.సూర్యకుమారి, వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మిరాణి, ఎంపీడీవో పి.పద్మజ, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పెందుర్తి పంచాయతీ రాజ్ డీఈగా రమణమూర్తి

పెందుర్తి, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ శాఖ పెందుర్తి నియోజకవర్గం డీఈగా పీవీ.రమణమూర్తి నియమితులయ్యారు. మంగళవారం ఆయన పెందుర్తిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెందుర్తి ఏఈ స్వాతి, జేఈ అప్పారావు, జూనియర్ సహాయకులు ఎల్.సత్యవతి, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పంచాయతీ రాజ్ డీఈఈ రమణమూర్తికి పుష్పగుచ్ఛం అందించిన ఇంజినీరింగ్ అధికారులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

నరవ (వేపగుంట), న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని విశాఖ ఇంజినీరింగు కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేయగా.. గాజువాక అమ్మబ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీ.వీ.ప్రదీప్‌వర్మ, కళాశాల బోర్డు డైరెక్టరు బోను భాస్కరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి చిటిమిరెడ్డి వీరునాయుడు, బ్లడ్ బ్యాంక్ అధ్యక్షులు కిరణ్, మేనేజరు సాగర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ, అధ్యాపకులు

కూటమి ప్రభుత్వ పాలనపై హర్షం



వాలిమెరకలో స్టిక్కర్లు అతికిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, తదితరులు

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెందుర్తి మండలం వి.జుత్తాడ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమాల ప్రచార కార్యక్రమం జరిగింది. పంచకర్ల మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించి ప్రచారాన్ని ప్రారంభించారు. పెందుర్తి ప్రత్యేకాధికారి పి.శేషశైలజ, పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు, ఎంపీడీవో కొల్లి వెంకటరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, సర్పంచి బొడ్డు చంద్రవాణి, వాలిమెరక, సరిపల్లి ఎంపీటీసీలు సైపురాజు స్వప్న, గొల్లవిల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: 88వ వార్డు నంగినారపాడు గ్రామంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల రమణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించారు. త్వరలోనే మహిళలకు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్ సదుపాయాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నంగినారపాడులో..



తానాం గ్రామంలో కరపత్రాలను అందజేస్తున్న సర్పంచి దేవి, ఎంపీటీసీ సభ్యులు సునీత

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాలాభివృద్ధి జరుగుతుందని తానాం సర్పంచి కన్నూరు దేవి అన్నారు. సోమవారం తానాం గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 100 రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో పాటు మున్ముందు చేపట్టబోయే వాటి గురించి వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, అనకాపల్లి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ, ఉపసర్పంచి వర్రి మంగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణ పనుల ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతి నగర్ దరి కనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో కల్వర్టు మరమ్మతుకు గురై రోడ్డు అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈనాడులో 'అసలే ఇరుకు.. ఆపై గుంతలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు జోన్-8 ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏఈ శివ రామ్‌ప్రసాద్ సమస్యాత్మక ప్రాంతాన్ని సందర్శించి గుత్తేదారుతో తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.13 లక్షల నిధులతో కాలువ, కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు తెలుగు యువత అధ్యక్షుడు పీలా జితేంద్ర పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సీహెచ్.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవం జరిగింది. ప్రిన్సిపల్ ఫ్లోరా, కార్యదర్శి థియోఫిలస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఎస్‌ఎస్‌ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ప్రోగ్రాం అధికారులు మంజుల, ప్రదీప్, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు

పరవాడలో భారీ వర్షం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో మంగళవారం రాత్రి 7 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పరవాడలోని వారపుసంత చిత్తడిగా మారింది. వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపైన నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇక్కట్లకు గురయ్యారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే ఈ వాన పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పరవాడ ప్రధాన రహదారి జలమయం



బొంకులదిబ్బ వద్ద..

నేడు ఎమ్మెల్యే పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: వాడచీపురుపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

27న ఏఎన్నార్ శత జయంతి వేడుకలు

ఎం.వి.పి.కాలనీ: ప్రముఖ సినీనటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఘనంగా నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో జరిగే వేడుకల్లో డాక్టర్ చక్రవర్తి సినిమాను ప్రదర్శించనున్నామన్నారు.

గ్రామాల్లో 'పొలం బడి'

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ, వెన్నెలపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తొలుత పరవాడలో వరి పొలాలను సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, రైతులతో కలిసి వ్యవసాయాధికారులు పరిశీలించారు. పంటకు చీడపీడలు, పోషక లోపాలున్నట్లు మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి గమనించారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. రైతులంతా ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సాంకేతిక పద్ధతులను అనుసరించి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. అనంతరం వెన్నెలపాలెంలో పర్యటించి వంగ తదితర పంటలను పరిశీలించారు.



పరవాడలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు, నాయకులు

ఈనాడు సినిమా

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.



కొరటాల శివ

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి.. విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".



ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర



సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్లు కలిసిన ప్రపంచాన్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు.

రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు





సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం



హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".



శ్రీహర్ష, కషిక కపూర్

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.

ఉక్కులో 'బర్న్స్ వార్డు' ఎక్కడ..?



స్టీల్ జనరల్ ఆసుపత్రి భవనం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ స్టీల్ జనరల్ ఆసుపత్రి (వీఎస్‌జీహెచ్)లో బర్న్స్ వార్డు ఎక్కడుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొన్నేళ్ల కిందట ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన వార్డు ఎన్నో సేవలు అందించింది. సుమారు 20 ఏళ్ల కిందట హెచ్‌పీసీఎల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి, 2013లో విశాఖ ఉక్కు ఎస్ఎంఎస్ ఆక్సిజన్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి అక్కడే చికిత్స అందించారు. అప్పటి ప్లాస్టిక్‌సర్జన్‌గా ఉన్న డాక్టర్ మహాపాత్ర సారథ్యంలో మెరుగైన సేవలు అందించిన బర్న్స్ వార్డుకు... ఆయన ఉద్యోగ విరమణ నిర్వహణ కొరవడింది. కొత్తగా ప్లాస్టిక్‌సర్జన్ నియామకం లేకపోవడంతో... కొవిడ్ తర్వాత వార్డు పూర్తిగా మూతపడింది. ప్రస్తుతం ఆ వార్డును అంకాలజీ విభాగానికి కేటాయించారు.

★ మంగళవారం ఎస్ఎంఎస్‌లో జరిగిన ప్రమాదంలో ఉక్కు అధికారి సీహెచ్.మల్లేశ్వరరావు 90 శాతం కాలిన గాయాలతో ఆసుపత్రికి తీసుకెళ్లినా, ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో, ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా ప్లాస్టిక్‌సర్జన్‌ను నియమించి, వార్డులో మెరుగైన సేవలు అందించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

పరీక్షల విభాగం ప్రక్షాళన

★ ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
★ బయటకు వెళ్లాలంటే సంతకం పెట్టాల్సిందే..

న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఈ) విభాగం ప్రక్షాళన దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు విభాగంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఫైలుపై సోమవారం సంతకం చేసినట్లు తెలిసింది.

సీఈ విభాగంలో అవినీతిపై విమర్శలు..

ఏయూ, దాని అనుబంధ కళాశాలల్లో చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లు ఈ సీఈ విభాగం నుంచే అందుకోవాల్సి ఉంటుంది. వారు సర్టిఫికెట్లు పొందాలంటే అందులో పనిచేసే కొందరి చేతులు తడపాల్సిందే. దీంతో ఈ విభాగం వల్ల ఏయూకి చెడ్డ పేరు వస్తుందని భావిస్తున్నారు. ఈ విభాగంపై ప్రభుత్వం వరకు ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు చర్యలు వేగవంతం చేయడానికి ఉపక్రమించారు.

హై రెజుల్యూషన్ కెమెరాలు..

సీఈ విభాగంలో అవినీతిని అరికట్టి వారిలో పరివర్తన తీసుకురావాలని వీసీ భావిస్తున్నారు. ఆ విభాగంలో అడుగడుగునా హై రిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఈ డీన్ ఆచార్య కేశవరావును ఆదేశించారు. దీంతో కెమెరాలు కొనుగోలు చేసి మరో రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక నుంచి సంతకం చేయాల్సిందే...

సీఈలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇప్పటి వరకు తమ వ్యక్తిగత పనుల కోసం ఇష్టానుసారం వర్సిటీ బయటకు వెళ్లివస్తుండేవారు. ఇక నుంచి బయటకు వెళ్లాలంటే సంతకం చేసి వెళ్లవలసి ఉంటుంది. విద్యార్థులు, ఉద్యోగులు ఎవరైనా సీఈలోకి వెళ్లాలంటే వారి గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. అలాగే బయట సందర్శకులు వచ్చినా రిజిస్టర్‌లో సంతకం చేసి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. ఈ తరహా ప్రక్షాళన ప్రయత్నాల వల్ల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగంలో అవినీతిని అరికట్టవచ్చుని భావిస్తున్నారు.



అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు డీఏ



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఏయూ పరిధిలోని కళాశాలలు ఏదైనా టోర్నీ నిర్వహిస్తే కళాశాల వ్యాయామ విద్యావిభాగానికి రూ.20వేలు మంజూరు చేస్తామని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. వర్సిటీలో మంగళవారం క్రీడా బోర్డు సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అంతర వర్సిటీ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లకు రూ.400 చొప్పున డీఏ అందజేస్తామన్నారు. ఇంజినీరింగ్ క్యాంపస్‌లో పదివేల మంది విద్యార్థులు చదువుతున్నారని, వారు ఆడుకోవడానికి మైదానాలు సిద్ధం చేయాలని ఏయూ వ్యాయామ విభాగ డైరెక్టరు విజయమోహన్‌కు సూచించారు. ఏయూ రిజిస్ట్రారు ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ వర్సిటీ క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాయామ విభాగాధిపతి ఎ.పల్లవి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత ఆర్థిక విధానాలకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సమ్మిళిత ఆర్థిక విధానాలకు, అభివృద్ధి అంశాలకు ప్రాధాన్యమిస్తూ విజన్ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర-2047పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజన్ ప్రణాళికలు రూపొందించడంలో అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. శాఖలవారీగా జాబితాలను తయారు చేసే క్రమంలో జిల్లా స్థాయి అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి అంశాలకు ప్రాధాన్యమిస్తూ 2024-29 కాలానికి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు.

జూలో వన్యప్రాణి వారోత్సవాలు


ఎండాడ, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల(జూ)లో వచ్చే నెల 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ, విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో వారం రోజుల పాటు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డబ్ల్యూటీఆర్ఈ), వైజాగ్ రైటర్స్, గ్రీన్ క్లైమేట్ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ పోటీల్లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. సంబంధిత రోజుల్లో చిత్రలేఖనం, జూ అవుట్‌రీచ్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రాం, రీల్ మేకింగ్ పోటీ, సీతాకోకచిలుకల పెంపకం, విత్తన బంతుల తయారీ, అంతర్జాతీయ జూ సంరక్షకుల దినోత్సవం, పక్షి నడక, ఫొటోగ్రఫీ, వైజాగ్ హాఫ్ మారథాన్, కవిత్వం, కథలు తదితరాలపై పోటీలు, సదస్సులు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 78936 32900 నంబరుకు ఫోనులో సంప్రదించాలన్నారు. ఈ పోటీల్లో అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చునన్నారు.

రాత్రి ఆహారవీధి తొలగింపునకు తీర్మానం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా ఉన్న రాత్రి ఆహార వీధి (నైట్ ఫుడ్ స్ట్రీట్)ను తొలగించాలని ఉప మేయరు కటుమూరి సతీష్ కౌన్సిల్ సమావేశంలో కోరారు. ప్రస్తుతం అక్కడ 179 దుకాణాలు ఉన్నాయని, వాటి ద్వారా ఆదాయం సమకూరడంలేదన్నారు. తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైకాపా హయాంలోనే ఒకసారి తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఆయా వివరాలను సభ్యులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. దీంతో మేయరు రాత్రి ఆహారవీధిని తొలగించేలా తీర్మానం చేసి, తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు.

జీవీఎంసీ సీఈగా శివప్రసాదరాజు

ఏఈ, డీఈఈలకు బదిలీలు



శివప్రసాదరాజు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన ఇంజినీరుగా శివప్రసాదరాజును నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన విజయవాడ నుంచి వస్తున్నారు. జీవీఎంసీకి చెందిన ఎస్ఈ వినయ్‌కుమార్, వేణుగోపాలరావుకు ప్రధాన ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. ఎం.వినయ్‌కుమార్‌ను ఏపీయూఎఫ్ఐడీసీ ప్రధాన ఇంజినీరుగా, వేణుగోపాలరావును విజయవాడ టిడ్కోకు పంపించారు. అదే విధంగా 18 మంది సహాయ ఇంజినీర్లు, 12 మంది డీఈఈలను జీవీఎంసీ నుంచి ప్రభుత్వం బదిలీ చేసింది. ఏళ్ల తరబడి తిష్టవేసిన వారిని ఇక్కడ్నుంచి పంపించినా, గతంలో ఇక్కడ పని చేసిన వారినే తిరిగి జీవీఎంసీకి వేయడం గమనార్హం.

జె.సి.ప్రభాకరరెడ్డిపై ఈడీ కేసు వాయిదా



న్యాయవాదులతో జె.సి.ప్రభాకరరెడ్డి

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: ఈడీ కేసులో తెదేపా నాయకుడు జె.సి.ప్రభాకరరెడ్డి సహా మరో 13 మంది మంగళవారం విశాఖ జిల్లా కోర్టు ప్రాగణంలోని మెట్రోపాలిటన్ సెషన్సు న్యాయస్థానం కమ్ ఒకటో అదనపు జిల్లా న్యాయస్థానానికి హాజరయ్యారు. కేసు వివరాలిలా ఉన్నాయి... బీఎస్-4 ప్రమాణాలతో వాహనాలను తయారు చేయాలని సుప్రీంకోర్టు 2017లో ఉత్పత్తిదారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో నిందితులు ఒక సంస్థ ఉత్పత్తి చేసిన బీఎస్-3 వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, తప్పుడు పత్రాలను సృష్టించి బీఎస్-4 వాహనాలుగా వివిధ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించి, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని ఆరోపిస్తూ ఈడీ కేసు నమోదు చేసింది. మంగళవారం ఈ కేసు విచారణకు వచ్చింది. నిందితులు జె.సి.ప్రభాకరరెడ్డి సహా మరో 13మంది న్యాయస్థానానికి హాజరై పూచీకత్తులను సమర్పించారు. తదుపరి విచారణ నిమిత్తం న్యాయమూర్తి ఎం.వెంకటరమణ కేసును నవంబరు 8వ తేదీకి వాయిదా వేశారు.

ఉత్తర్వులు రద్దు చేయాలని ధర్నా

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ, ఎల్టీసీ, ఎల్ఎల్‌టీసీతో పాటు ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలను వాయిదా వేస్తూ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఇంటక్ నాయకులు కోరారు. మంగళవారం ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఉక్కు ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడారు. వేతన సవరణ అమలు కాక, సకాలంలో జీతాలు అందక కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే... ఇప్పుడు కొత్త ఉత్తర్వుల ద్వారా మరిన్ని ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఇన్‌ఛార్జి యు.శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఇంటక్ సభ్యులు కె.రమణ, పి.వి.రమణమూర్తి, ఎస్.ఎ.నాయుడు, సుబ్బయ్య, ప్రసాద్, దేముడు పాల్గొన్నారు.



ఈడీ(వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంటక్ నాయకులు, సభ్యులు



సుజాతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

ఉపకమిషనర్ సుజాతకు అభినందనలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ ఉప కమిషనర్‌గా పదోన్నతి పొందిన ఎన్.సుజాతకు ఆశాఖ ఉద్యోగులు అభినందించారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కలిసి సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ బలివాడ ప్రసాద్ పట్నాయక్, ఈఓలు శ్యామలరావు, సర్వేశ్వరరావు, సహాయ కమిషనర్ కార్యాలయ సిబ్బంది కోదండం, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎస్ మురళీమోహన్, ఈఓ శేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి గుర్తింపు.. పదవుల్లో ప్రాధాన్యం

ఈనాడు, అనకాపల్లి: కూటమి విజయానికి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వం కొలువుతీరి వంద రోజులు పూర్తయిన వేళ రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు సభ్యులను నామినేట్ చేశారు. అందులో అనకాపల్లి, అరకు పార్లమెంటు పరిధిలోని పలువురు నేతలకు చోటుదక్కింది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పొత్తుకోసం సీట్లు త్యాగం చేసిన సమన్వయకర్తలకు నామినేట్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి ఇద్దరికి కార్పొరేషన్ ఛైర్మన్లగా అవకాశం కల్పించగా మరో అయిదుగురిని డైరెక్టర్లుగా నియమించారు. తెదేపాతో పాటు భాజపా, జనసేన పార్టీలకు కూడా ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు సామాజిక వర్గాలపరంగా సమన్యాయం పాటించారు.

పీలాకు పెద్దపీట: అనకాపల్లి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణకు నామినేట్ పదవుల్లో ప్రాధాన్యం దక్కింది. పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా ఆయన్ని నియమించారు. 2014-19 వరకు అనకాపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్న వేళ పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేన పార్టీకి కేటాయించారు. అయినా నిరాశ చెందకుండా కూటమి విజయమే లక్ష్యంగా పనిచేశారు. జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ అఖండ మెజారిటీ సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల ప్రచార సభల్లోనే తెదేపా, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు పీలాను అభినందించారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - మత్తు వదలరా-2
రామలక్ష్మి - మన్మథుడు, శ్రీ...
సరిపోదా శనివారం, సప్తగిరి - ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైం, చేటు మహరాజ్ (ఆనందపురం) - ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైం

గ్రామంలో వైద్య శిబిరం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై గిరిజన గ్రామం వద్ద సిటూ గోపాలపట్నం జోన్, అల్లూరి విజ్ఞాన కేంద్రం, ప్రజారోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. గోపాలపట్నం సిటూ జోన్ పూర్వ కార్యదర్శి పైడా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. సిటూ గోపాలపట్నం జోన్ కార్యదర్శి ఎం.వి.ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు బి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వయంఉపాధి కోర్సులో శిక్షణకు ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన కింద భీమిలి ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో ఇందు కోసం స్వల్పకాలిక శిక్షణ ఇస్తారు. ఇందులో 35 ఏళ్లలోపు మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాల్లో ప్రోత్సహిస్తారు. ఆసక్తి గల వనితలు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఎం.అన్నపూర్ణ చరవాణి (90147 58949)కి ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి. భీమిలి పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ కోరారు.

చంద్రంపాలెం క్రీడారత్నాలు

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



కొమ్మాది, న్యూస్‌టుడే

పాఠశాల స్థాయిలోనే రెజ్లింగ్ క్రీడను లక్ష్యంగా ఎంచుకుని దాని కోసం సాధన చేస్తూ విజయాలను సొంతం చేసుకుంటున్నారు చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడాకారులు. రెజ్లింగ్‌లో భాగమైన గ్రాప్లింగ్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి తమ ప్రత్యేకతను చాటుకున్నారు.

★ తిరుపతి రేణిగుంటలో ఇటీవల జరిగిన 4వ రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో చంద్రంపాలెం పాఠశాల విద్యార్థులు 15మంది రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కె.పవన్, పి.రవి, జి.నరేంద్ర, మితేష్, ఎస్.రేవంత్‌సాయి, డి.చైతన్య, జె.జీవన్‌కుమార్, ఎస్.గాయత్రి స్వర్ణ పతకాలు; ఎల్.పవన్, వై.సాయికుమార్, జి.హర్ష, పి.కార్తిక్, పి.కార్తికేయ, జె.జీవిత, ఎం.లలిత వెండి పతకాలు సాధించారు. ఈ విజేతలతోపాటు వీరికి శిక్షణ అందించిన పేడాడ మురళి, ఆర్.బాలబస్వూర్ సాయి, మేనేజర్ ఎం.గణేష్‌లను ప్రధానోపాధ్యాయులు సోమయాజులు, ఫిజికల్ డైరెక్టర్ పెంటకోట రాము, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. హరియాణాలో అక్టోబరులో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లోనూ వీరు ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



పతకాలు సాధించిన విజేతలు



ప్రత్యర్థిని ఏ విధంగా అధిగమించి విజేతగా నిలవాలో తెలుసుకున్నా. అందుకే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. అక్కడ కూడా ప్రత్యర్థులను ఓడించి తప్పకుండా పతకం సాధిస్తా.
-పి.కార్తిక్, 10వతరగతి



భారత కుస్తీ యోధులు రవికుమార్, నవీన్ స్ఫూర్తితో మరింత సాధన చేసి గ్రాప్లింగ్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటా. హరియాణాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించేందుకు ప్రత్యేక సాధన చేస్తున్నా.
-పి.రవి, 9వతరగతి

మరింత సాధన చేయిస్తున్నాం..



ఇక్కడి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. వచ్చే నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లోనూ స్వర్ణ పతకాలు సాధించాలనే లక్ష్యంతో సాధన చేయిస్తున్నాం. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల బాల బాలికలు కామన్వెల్త్ క్రీడలకు ఎంపికవ్వాలనే సంకల్పంతో నిత్యం శిక్షణ అందిస్తున్నాం. తప్పకుండా ఆ కల సాకారం చేసేందుకు కృషి చేస్తాం.
-పేడాడ మురళి, శిక్షకులు, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల



శిక్షకులు మురళి పర్యవేక్షణలో ప్రాథమిక నైపుణ్యాలపై పట్టు సాధించి మెలకువలు నేర్చుకుని పోటీల్లో పాల్గొన్నా. రాష్ట్రస్థాయిలో మూడు స్వర్ణాలు, జాతీయస్థాయిలో వెండి, రజత పతకాలు సాధించా. ఇటీవల రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో స్వర్ణం పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం.
– ఎస్.రేవంత్, పదోతరగతి



మా పాఠశాలలో శిక్షకులు అందించిన ప్రోత్సాహంతో ఏ క్రీడనైనా ఇష్టంతో ఆడితే విజయం తథ్యమని తెలుసుకున్నా. అందుకే భిన్నమైన క్రీడ గ్రాప్లింగ్‌లోనూ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకాలు సాధించా. త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించేందుకు కృషి చేస్తున్నా.
– జి.హర్ష, 10వతరగతి

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: సాగర్‌నగర్ శివాలయానికి వెళ్లే రహదారిలో నిత్యం విద్యుత్ దీపాలు వెలగక అంధకారంతో ఇక్కట్లకు గురవుతున్నాం.
–స్థానికులు, సాగర్‌నగర్

సమాధానం: విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. -సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: ఎండాడ చెరువు(ట్యాంక్‌బండ్) చుట్టూ వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. –హరి, ఎండాడ

సమాధానం: చెరువు పరిసరాల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం.
–కిషోర్, ఆరోగ్య అధికారి

సమస్య: దుర్గానగర్(ఎండాడ) నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి.
–స్థానికులు, దుర్గానగర్

సమాధానం: సంబంధిత ప్రాంతాల్లో శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.
–రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

శాంతి హోమం.. ఆలయ సంప్రోక్షణం

సింహాచలం, న్యూస్‌టుడే: తిరుమలలో నెయ్యి కల్తీ వ్యవహారం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రాయశ్చిత్త కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో శాంతి హోమం, సంప్రోక్షణ కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వేకువజామున జలాలతో ఆలయాన్ని, ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం సేవలు నిర్వహించారు. తర్వాత ఆలయ కల్యాణ మండపంలోని హోమగుండం ఎదుట సుదర్శనమూర్తిని అధిష్ఠింపజేసి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. వాస్తు ఆవాహనం, సుదర్శన హవనం, నృసింహ మూలమంత్ర సహితంగా శాంతి హోమం నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ హోమద్రవ్యాలను యజ్ఞగుండంలో సమర్పించి పూర్ణాహుతి జరిపించారు. భీమిలి, పెందుర్తి, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, పెతకంశెట్టి గణబాబు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం ఈ పూజల్లో పాల్గొని యజ్ఞగుండం ప్రదక్షిణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

ఘనంగా ఎన్.ఎస్.ఎస్.దినోత్సవం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం(ఎన్.ఎస్.ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రధానాచార్యులు డా.సి.హెచ్.విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్. విభాగంలో చేరడం ద్వారా సామాజిక కార్యక్రమాలకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వాలంటీర్లు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపర్చారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారులు ఎన్.అప్పలనాయుడు, ఎస్.శ్రీను పాల్గొన్నారు.



భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేస్తున్న వాలంటీర్లు

పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యపడుతుందని గీతం డీమ్డ్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతం సెంటర్ ఫర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ఇన్నోవేషన్స్ మహిళా సాధికారిక, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్ర, జిమ్సర్ సామాజిక వైద్య విభాగాలు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాతీయ పోషకాహార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు గీతం విద్యార్థులతో పాటు నగరంలోని పలు ఆహార ఉత్పత్తుల సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన రిజిస్ట్రార్ ఆచార్య డి.గుణశేఖరన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోషకాహార విలువలతో గీతం విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాల రుచి చూసి అభినందించారు. ఆయా విభాగాల ఛైర్‌పర్సన్ డాక్టర్ శ్రీవిద్య, డైరెక్టర్ ఆచార్య ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గౌతమ్‌రావు తదితరులు

దుర్గాదేవి ఉత్సవాలకు ఏర్పాట్లు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని గుడ్లవానిపాలెం భూలోకమ్మ, ముత్యాలమ్మ, పోలమాంబ అమ్మవార్ల ఆలయాల ప్రాంగణంలో విజయదశమి సందర్భంగా వచ్చే నెల 3వ తేదీ నుంచి దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు వేడుకల నిర్వహణ తీరు తెన్నులు తదితర అంశాలపై గుడ్లవానిపాలెం బాపూజీ యువజన సేవా సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు మంగళవారం చర్చించారు. అదే నెల 12వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవార్లను విశేషంగా అలంకరించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు పేర్కొన్నారు.

భారతీయ సంగీతం ఎంతో విశిష్టమైనది

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారతీయ శాస్త్రీయ సంగీతం, కళలు, ఎంతో విశిష్టమైనవని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఏయూ సంగీత నృత్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఏయూ సంగీత విభాగం 35వ, నృత్య విభాగం 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఈ సదస్సులు నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. మానవుడి జన్మ సంగీతం, నృత్యంతో ఆరంభం అవుతుందన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, నాట్యాచార్యులు హరిరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నార్త్ సబ్ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.అప్పలరాజును 8వ వార్డు తెదేపా నాయకులు చెట్టిపిల్లి గోపి, ఒమ్మి బాబూరావు తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎండాడ పెట్రోల్ బంక్ కూడలిలో ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు, ఎండాడ-రుషికొండ ప్రధాన మార్గంలో యువత అతి వేగంగా వాహనాలు నడపడంతో పలువురు ప్రమాదాల బారిన పడడం, రుషికొండ కూడలిలో ఈ పోలీసింగ్ కేంద్రం పునరుద్ధరణ తదితర వాటిపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

భీమిలి సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కొత్త సబ్ రిజిస్ట్రార్(ఎస్.ఆర్)గా **హర్షవర్ధన్ రెడ్డి** మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెండేళ్లుగా సబ్ రిజిస్ట్రారుగా పనిచేస్తున్న తులసీదాస్ శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి హర్షవర్ధన్ రెడ్డి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఈ కార్యాలయం పరిధిలో భీమునిపట్నం, పద్మనాభం మండలాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు.

భీమిలి ఎంపీడీవోగా హనుమంతురావు



గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎన్.హనుమంతురావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాతవరం ఎంపీడీవోగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ మండలాభివృద్ధి అధికారిణిగా పనిచేసిన డాక్టర్ వి.జానకి ఆనందపురం మండలానికి బదిలీపై వెళ్లారు. భీమిలి మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల క్రీడా పోటీలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిట్టివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడాపోటీలు రెండ్రోజులుగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం బాలికలకు అండర్-17, అండర్-14 విభాగాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ క్రీడాపోటీలో భీమిలి గురుకుల పాఠశాల, మూలకుద్దు కేథరిన్ పాఠశాల, కబడ్డీలో చిట్టివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మంగమారిపేట జడ్పీ ఉన్నత పాఠశాల, యోగాలో సన్ పాఠశాల, చిట్టివలస జడ్పీ ఉన్నత పాఠశాలలు విజేతలుగా నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ కన్వీనరు చిల్ల వెంకటరెడ్డి తెలిపారు. ఆఖరి రోజైన బుధవారం బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు.

పద్మనాభం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలగడంతో పాటు ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కె.రాంబాబు అన్నారు. పద్మనాభంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ మంగళవారం ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 నుంచి 17ఏళ్ల లోపు బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు సుంకర గిరిబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కె.దామోదరరావు, మండల విద్యాశాఖాధికారి పి.రమణ, ఎస్.బాబూలాల్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం..పాక్షికంగా ధ్వంసం

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ నాల్గోవార్డు మంగమారిపేట కొండవాలు ప్రాంతంలో అక్రమంగా నిర్మిస్తున్న ఓ ఇంటి నిర్మాణాన్ని రెవెన్యూ యంత్రాంగం మంగళవారం పాక్షికంగా తొలగించింది. నగరానికి చెందిన ఓ వ్యక్తి ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నట్లు గుర్తించిన రెవెన్యూ సిబ్బంది తహసీల్దారు రామారావు ఆదేశాల మేరకు వాటిని ధ్వంసం చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే లక్షలాది రూపాయల విలువైన ఈ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ఈ అక్రమ కట్టడాన్ని అడ్డుకోవడం ద్వారా దాదాపు రూ.10లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించినట్లు అధికారులు చెప్పారు. ఈ అక్రమ నిర్మాణాన్ని తూతూమంత్రంగా కాకుండా పూర్తిగా తొలగించాల్సి ఉంది.

రెండు కొత్త ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు నూతన ప్రైవేటు జూనియర్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం తిమ్మాపురం, కాపులుప్పాడ గ్రామంలో విజ్ఞాన్ విజన్ జూనియర్ కళాశాల, తిరుపతి గ్రామీణ మండలం దుర్గసముద్రంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతిస్తూ వేర్వేరుగా ఉత్తర్వులు ఇచ్చింది.

కూటమి పాలనలో అన్ని రంగాల్లో ముందడుగు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనలో రాష్ట్రం అన్నింటా అగ్రగామిగా అవతరించనుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ నాల్గోవార్డు కాపులుప్పాడలో మంగళవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజావేదికలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విజన్-2020 పేరిట అప్పట్లో హైదరాబాద్‌ను దేశంలోని అగ్రగామి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దగా, విజన్-2047తో నవ్యాంధ్రను అభివృద్ధి, సంక్షేమం, ఐటీ సహా అన్నిరంగాల్లో ప్రగతి పథంలో నడపనున్నారన్నారు. వైకాపా పాలనలో సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని వందరోజుల్లోనే ప్రగతి పథంలో నడిపిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉన్న వరి పొలాలను, స్థానికుల కోరిక మేరకు పాత పరదేశిపాలెంలోని కాజ్‌వేను పరిశీలించారు. భీమిలి జోనల్ కమిషనరు ప్రేమ ప్రసన్నవాణి, జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్, స్థానిక నాయకులు కోరాడ రాజబాబు, కంటుభుక్త రామానాయుడు, బోర రాధాకుమారి, పాసి నర్సింగరావు, సర్పంచులు బోర బంగారెడ్డి, దుంప నర్సింహమూర్తి, నారు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని జనసేన 5వవార్డు అధ్యక్షుడు దేవర శివ పేర్కొన్నారు. తెదేపా 5వవార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత సారథ్యంలో దేవర శివ అధ్యక్షతన మంగళవారం 5వవార్డు పీపీ-2 కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధితో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. జనసేన నాయకులు అప్పారావు, బత్తిన శివ, సన్ని, వెంకటరమణ, శ్యామ్, సూర్యకుమారి, తెదేపా నాయకులు రమణమ్మ, ప్రసన్న, శైలజ, సౌజన్య, సచివాలయ ఉద్యోగులు సుప్రియ, నాగేంద్ర పాల్గొన్నారు.

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్‌లో 8వవార్డు తెదేపా అధ్యక్షుడు చెట్టిపిల్లి గోపి, జిల్లా తెదేపా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, ఎస్.మంగాదేవి ఆధ్వర్యంలోనూ ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంచిపెట్టారు. యూత్ అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు, సీహెచ్.సన్యాసిరావు, బెల్లాన శ్రీనివాస్, తోనంగి రవికుమార్ తదితర కూటమి నాయకులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



పీపీ-2 కాలనీలో..



సాగర్‌నగర్‌లో..

వేడుకగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



మజ్జివలస(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత శ్రీ రాస పోలమాంబ అమ్మవారిని బెల్లం దిమ్మలు, వివిధ రకాల పూలతో మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఆటో కార్మికుల సంఘ సమావేశం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: ఆటో కార్మికుల సంక్షేమానికి, భద్రతకు సమగ్ర చట్టం చేయాలని సీపీఎం, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. తగరపువలస జాతీయ రహదారి వద్ద మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు వివరిస్తూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాము, కార్యదర్శి పెంటరాజు, ఇతర ప్రతినిధులు వెంకటరావు, రమణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి

భూ అక్రమాలపై పరిశీలన

పద్మనాభం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో మండల పరిధిలో జరిగిన భూ అక్రమాలపై ల్యాండ్ ప్రొటెక్షన్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ టి.సీతారామాంజనేయులు పద్మనాభం మండలంలో మంగళవారం వివిధ గ్రామాల్లో పర్యటించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. మండలంలోని ఫ్రీహోల్డ్ భూములు 70 ఎకరాలు, ల్యాండ్ పూలింగ్ 25 ఎకరాలు, సర్వీస్ ఇనాము భూమి 25 ఎకరాల మేర అవకతవకలు జరిగినట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు ప్రత్యేకాధికారి మద్ది, కొవ్వాడ, కోరాడ, పాండ్రంగి గ్రామాల్లో పర్యటించి సంబంధిత భూములను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పొలం పిలుస్తోంది

పద్మనాభం, ఆనందపురం, న్యూస్‌టుడే: ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు షెడ్యూలు ప్రకారం గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి క్షేత్ర పరిశీలన చేపట్టాలని భీమిలి వ్యవసాయశాఖ ఏడీఏ బి.విజయ్‌ప్రసాద్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మద్ది, అనంతవరం గ్రామాల్లో నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు దోహదపడే సలహాలు, సూచనలు రైతులకు అందించాలని ఏడీఏ సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎం.వి.ఎస్.చలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, మండల వైకాపా యూత్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో...

మండలంలోని వేములవలస, వెల్లంకి గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయధికారి కె.అప్పలస్వామి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు వ్యవసాయరంగం గురించి పలు సలహాలు, సూచనలు అందించారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని మేలైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎం.మన్మధరావు, కె.సత్యనారాయణరెడ్డి, సి.హెచ్.సంధ్య రత్నప్రభ, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు పడాల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వెల్లంకిలో రైతులతో సమావేశమైన అధికారులు

ఆబ్కారీ ఠాణా అవతరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్లను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు స్టేషన్లుగా మార్పు చేశారు. ఎన్నో ఏళ్లుగా అమల్లో ఉన్న ఎక్సైజు స్టేషన్ల(ఆబ్కారీ ఠాణా)ను గత ప్రభుత్వం సెబ్ స్టేషన్లుగా మార్పు చేసింది. ఇందులో పనిచేసే కొంతమందికి ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం సరఫరాతోపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. మరికొందరికి బెల్ట్ దుకాణాల నిర్మూలన, గంజాయి, ఇతరత్రా మాదకద్రవాల రవాణా అరికట్టే విధులు అప్పగించారు. ఈ మార్పులకు ఇష్టపడని సిబ్బంది అయిదేళ్లుగా అసంతృప్తితోనే బాధ్యతలు చేపట్టారు. కాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈ విధానానికి చరమగీతం పాడింది. వీటిని అందరికీ ఆమోదయోగ్యమైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు స్టేషన్లుగా మార్పు చేశారు. భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాలకు సంబంధించి భీమిలిలో ఉన్న సెబ్ స్టేషన్ పేరును తాజాగా మార్పు చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు స్టేషను పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. ఇక మీదట అధికారులు సైతం సెబ్ అధికారులుగా కాకుండా ఎక్సైజు అధికారులుగా వ్యవహరించబడతారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



భీమిలిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

విశాఖ తూర్పు


కాలువ కోసం తవ్విన పునాది

పనులు కాకుంటే ప్రమాదమే..

ఆరిలోవ, న్యూస్‌టుడే: పెదగదిలి కూడలిలో బీఆర్టీఎస్ రోడ్ల మీద వర్షపు నీరు నిలబడకుండా కొత్తగా కాలువ నిర్మాణం తలపెట్టారు. విమ్స్ ఆసుపత్రి ప్రహరీ గోడ పునాది భాగం కొంత పగలగొట్టి నీరు వెళ్లేందుకు కాలువ నిర్మిస్తున్నారు. ఈ కాలువ ద్వారా బీఆర్టీఎస్ రోడ్డుపై పడిన వర్షపు నీరు గెడ్డలోకి వెళ్తుంది. అయితే కాలువ పనులు కొన్ని నెలలుగా జరుగుతున్నాయి. పెద్ద వర్షం పడితే విమ్స్ ప్రహరీకి ప్రమాదం జరగవచ్చు.

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-5లో కాలువల్లో నీరు చేరి దోమల బెడద పెరిగింది. ఫాగింగ్ చేయగలరు – **లక్ష్మీ**

సమాధానం : కాలువలు శుభ్రం చేయించి మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయిస్తాం

– ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

సమస్య : ఎంవీపీకాలనీ అప్పుఘర్ నుంచి పైలాన్ కూడలికి వచ్చే మార్గంలో గోతులు ప్రమాదకరంగా మారాయి – **హనుమంతురావు**

సమాధానం : పరిశీలించి గోతులను పూడ్చుతాం – శ్రీనివాస్, డి.ఈ

అవీ ఇవీ

స్వచ్ఛమైన భారతదేశాన్ని నిర్మిద్దాం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛమైన భారతదేశ లక్ష్యాన్ని సాధించడానికి జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు కృషి చేయాలని మిజోరం యూనివర్సిటీ సోషల్ వర్క్ ఆచార్యులు డాక్టర్ కొట్టుశేఖర్ అన్నారు. ఏయూలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'గాంధీ-స్వచ్ఛభారత్ - జాతీయ సేవా పథకం' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎస్.వి.కృష్ణ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో సామాన్య కార్యకర్తలు గుర్తింపు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల భర్తీలో సామాన్య కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వటం జరిగిందని, తద్వారా వారి సేవలను పార్టీ గుర్తించటం జరిగిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అంకిత భావంతో పార్టీ కోసం పని చేసే పదవులు అవే వస్తాయని చెప్పటానికి ఇదే నిదర్శనమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల భర్తీపై హర్షం వ్యక్తం చేశారు.

27న ఏఎన్నార్ శత జయంతి వేడుకలు

ఎం.వి.పి.కాలనీ: ప్రముఖ సినీనటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో జరిగే వేడుకల్లో డాక్టర్ చక్రవర్తి సినిమాను ప్రదర్శించనున్నామన్నారు. అక్కినేని అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: హెచ్‌బీకాలనీ, మద్దిలపాలెం 11కేవీ విద్యుత్తు ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఇ.ఇ. వి.సింహాచలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌బీకాలనీ, దాకలిపేట, శైలేశ్వర్లర్స్ ఏరియా, ఆదర్శనగర్, సింహపురి, వుడా అపార్టుమెంట్స్, ఎల్ఐసీ కార్యాలయం ఏరియా, పాత ఏసీబీ కార్యాలయం, దుర్గానగర్, పోస్టాఫీస్ ఏరియా, హెచ్‌బీకాలనీ చివరి బస్‌స్టాప్, కేఆర్ఎంకాలనీ, భానునగర్, డీసీపీ కార్యాలయం, చాకలిపేట, దుర్గానగర్, సీఎంఆర్ ఐల్లు, లక్ష్మీనరసింహనగర్, సంజయ్‌గాంధీకాలనీ, పాతవెంకోజీపాలెం, కృష్ణా కళాశాల రహదారి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

26న దివ్యాంగులకు ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే : దివ్యాంగులకు ఉద్యోగ మేళా ఈనెల 26న ఉదయం పది గంటలకు జరగనుంది. ఏయూ మైదానం, ఏయూ ప్లాట్‌ఫాం, ఏయూ కన్వెన్షన్ సెంటర్ వద్ద అభ్యర్థులు హాజరుకావచ్చు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. అభ్యర్థులు బయోడేటా, వైకల్యం పత్రాలతో హాజరుకావాలి. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ, నేషనల్ దివ్యాంగజన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరు ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సాధికార విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరుగనున్నదని నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరు ప్రాంతీయ ఉపాధి అధికారి ఎన్.శ్యామ్‌సుందర్ తెలిపారు.

స్వయం ప్రతిపత్తికి అర్హతల పరిశీలన

డాబాగార్డెన్స్(అల్లిపురం), న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అకడమిక్ కౌన్సిల్ సమావేశం ప్రిన్సిపల్ ఆర్.మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఏయూ సైన్స్, టెక్నాలజీ విభాగ అసిస్టెంట్ ప్రిన్సిపల్ ఆచార్య అనురాధ కళాశాల, ఆచార్య సంధ్య డీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ పీఎల్ శరణ్య మాట్లాడుతూ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడానికి అవసరమైన అన్ని వసతులున్నాయని వివరించారు. గత సమావేశంలో ప్రతిపాదించిన పలు అంశాలను ధ్రువీకరించాలని సభ్యులను కోరారు.

ఆట వస్తువులు అలా వదిలేశారేం..

మరమ్మతులు చేపడితే ప్రయోజనం


ఉపయోగించడానికి వీలు లేని విధంగా...



జీవీఎంసీకి చెందిన అతి పెద్ద ఉద్యానవనాల్లో ముడసర్లోవ ఒకటి. గతంలో ఉద్యానవనాల విషయానికి వస్తే ముడసర్లోవ గురించి గొప్పగా చెప్పే పరిస్థితి ఉండేది. మరి ఇప్పుడు నిర్వహణను గాలికి వదిలేయటంతో పార్కు పరిసరాలు అధ్వానంగా మారాయి. ప్రధానంగా చిన్నారులు ఆడుకునే క్రీడా సామగ్రి చాలావరకు మరమ్మతులకు వచ్చి నిరుపయోగంగా మారాయి. లక్షలు వెచ్చించి ఇక్కడ ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రిని ఎవరూ వినియోగించకపోవటంతో చాలావరకు మూలకు చేరినట్లుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా క్రీడా సామగ్రికి మరమ్మతులు చేస్తే ముడసర్లోవ పార్కుకు వచ్చే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీని నిర్వహణపై ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.


మూలకు చేరిన క్రీడా పరికరాల దుస్థితి

––న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హామీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ఆర్టీసీ అధికారులు కార్మికులపై చిన్నచూపు చూసి వేధింపులకు గురిచేస్తే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టిన గతే పడుతుందని నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హెచ్చరించారు. వాల్తేరు డిపోలో మంగళవారం సాయంత్రం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విష్ణుకుమార్‌రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్.ఎం.యు.ఎ. రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ఇబ్బంది పెడితే క్షమించేది లేదన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, వాల్తేరు డిపో సెక్రటరీ వసంతరావు, అధ్యక్షులు పి.జి.పతి, వివిధ డిపోల నుంచి యూనియన్ నాయకులు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రచారం..

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ తెదేపా, జనసేన నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంవీపీకాలనీ ఆదర్శనగర్‌లో మంగళవారం ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వం చేపట్టిన పథకాలతో పాటు రాబోయే కాలంలో ప్రవేశపెట్టనున్న పథకాల గురించి వివరించారు. తెదేపా నాయకులు కొళ్ల శంకర్, జనసేన నాయకులు బోగిల శ్రీనివాస పట్నాయక్, పలువురు తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా, జనసేన నాయకులు


పదో వార్డులో కరపత్రాలు పంచుతూ..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధిలోని సుందర్‌నగర్ కొండవాలులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. గాడు అప్పలనాయుడు, మద్దిల రాజశేఖర్, బండి రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు. తొమ్మిదోవార్డు పరిధిలోని విశాలాక్షినగర్‌లో వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో వార్డు తెదేపా అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, శ్రీనివాసరెడ్డి కరపత్రాలు పంచిపెట్టారు. వార్డు ఇన్‌ఛార్జ్ బుడుమూరి గోవింద్, నల్ల ఈశ్వరరావు, పకీరు పాల్గొన్నారు.

ఆరిలోవ: 13వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పైనాపిల్ కాలనీలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ఎస్ఎస్ఎస్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు పోత్ర కొండ దుర్గారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వై.సురేష్, ఎం.రమణి, బి.బాలస్వామి, సుబ్బాషిణి తదితరులు పాల్గొన్నారు.


జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో..

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తుందని 22వ వార్డు జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు గడిచిన సందర్భంగా మంగళవారం వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా వార్డులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


22వ వార్డులో...

అంతర్గత ప్రశాంతత ఎంతో ముఖ్యం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : సంతోషకరమైన శాంతియుత ప్రపంచ పౌరులను తీర్చిదిద్దడంలో భావోద్వేగ విద్య ముఖ్య భూమిక పోషిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం పీస్ కమ్యూనికేషన్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. పౌరులను శాంతియుతంగా తీర్చిదిద్దడంలో భావోద్వేగ విద్య పాత్రను వీసీ వివరించారు. అమెరికాలోని ఈక్వా పర్ పీస్ సంస్థ ప్రపంచ డైరెక్టర్ ఆచార్య మాట్ పెరెల్‌స్టీన్ మాట్లాడుతూ.. నేటి సంక్లిష్టమైన సమాజానికి మార్గనిర్దేశం చేయడానికి అంతర్గత ప్రశాంతత ఎంతో ప్రధానమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాట్ పెరెల్ స్టీన్, డాక్టర్ వల్లా కృష్ణవీర్ అభిషేక్, వెన్నెలకంటి గాయత్రి సంయుక్తంగా రచించిన కోపరహిత సమాజం పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, తదితరులు

విజేతలకు అభినందనలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : వైజాగ్ స్టార్స్ 11ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఏయూ ఉద్యోగుల జట్టును రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మంగళవారం అభినందించారు. మొత్తం 8 బృందాలు పాల్గొన్న ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఏయూ ఉద్యోగుల జట్టు ఎస్.ఆర్.కె.ఎస్.సి. జట్టుపై 2-0తో విజయం సాధించింది. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య టి.వి.కృష్ణ, టి.షారోన్‌రాజు, ఫుట్‌బాల్ బృందం కార్యదర్శి సీహెచ్ రమేష్, సభ్యులు డి.కె.ప్రధ, ఎ.సతీష్ కుమార్, కె.నాగరాజు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ ఉద్యోగులు

రామ్‌నగర్‌లో 'స్వచ్ఛతాహీ సేవ'


శుభ్రం చేస్తున్న 28 వార్డు టీడీపీ నాయకులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : నగరంలోని 28వ వార్డు పరిధిలోని రామ్‌నగర్ ప్రాంతంలో మంగళవారం ఉదయం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో రహదారులు శుభ్రం చేశారు. అధిక సంఖ్యలో తెదేపా కార్యకర్తలు పాల్గొని పరిసరాలు శుభ్రం చేశారు. వార్డు సెక్రటరీ ఉరుకోటి పైడిరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు పొదుపు సంఘం విరాళం


ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు చెక్కును అందజేస్తున్న పొదుపు సంఘం మహిళలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు 28వ వార్డు శ్రీ కనక మహాలక్ష్మి మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. రామ్‌నగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు రూ.15 వేల డి.డి.ని అందజేశారు. పొదుపు సంఘం సభ్యులు సారిపల్లి కనక మహాలక్ష్మి, కండిపిల్లి అంజమ్మ, మంగ, షేక్ హసీనా, సూర్యారావు, కొండలరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో విద్యార్థుల ప్రతిభ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఈనెల 22, 23వ తేదీల్లో తిరుపతిలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జూడో విభాగంలో విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని స్కూల్‌గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.దేముడు తెలిపారు. అండర్ 14 బాలుర 35 కిలోల విభాగంలో షేక్ చరణ్, బాలికల విభాగంలో 23 కిలోల స్థాయిలో బత్తిన పద్మ ప్రియాంక, 40 కిలోల విభాగంలో సమ్మింగ భాగ్యశ్రీ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. విజేతలను డీఈఓ చంద్రకళ శుభాకాంక్షలు తెలిపారన్నారు.

26 నుంచి అథ్లెటిక్స్ పోటీలు

ఈనెల 26న విశాఖ నగరంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయం జిమ్నాస్టిక్ స్టేడియంలో అండర్ 13, 15 అథ్లెటిక్స్ పోటీలు, పాడేరులోని కొవ్వూరు ప్రభుత్వ పాఠశాలలో రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. 27న మోడ్రన్ పెంటాథిలిన్ పోటీలను కేకేఆర్ గౌతం పాఠశాల ఆనందపురంలో, 28న ఈత పోటీలు ఆర్ఆర్ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ రైల్వే న్యూకాలనీ నిర్వహించనున్నామన్నారు. వివరాలను ఇప్పటికే కోచ్‌లకు సంక్షిప్త సమాచారం రూపంలో చరవాణులకు పంపించామన్నారు.



ప్రతిభకనబరిచిన విద్యార్థులు

ఘనంగా 'ప్రపంచ ప్రమాణాల దినోత్సవం'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మార్కింగ్, ధ్రువీకరణ కార్యకలాపాల కోసం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బి.ఐ.ఎస్) సంస్థ పనిచేస్తుందని బి.ఐ.ఎస్ సీనియర్ డైరెక్టర్ ఎం.ఎ.జె వినోద్ అన్నారు. హోటల్ గ్రీన్‌పార్కులో మంగళవారం ఉదయం ప్రపంచ ప్రమాణాల దినోత్సవం పురస్కరించుకొని విజయవాడ కార్యాలయం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాణ్యమైన పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. కార్యక్రమంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ రుచిరా గుప్తా, సంస్థ డిప్యూటీ డైరెక్టర్ వర్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపికాగుప్తా, బి.ఐ.ఎస్ సెక్షన్ ఆఫీసర్ భావనారాయణ, ప్రమోషన్ ఆఫీసర్ కృష్ణవీర్, జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఎ.జె. సీనియర్ డైరెక్టర్ వినోద్

స్పందించారు.. వాహనాలు క్రమబద్ధీకరించారు..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: హనుమంతువాక నుంచి దీనదయాళపురం వరకు బీఆర్టీఎస్ సర్వీసు రహదారిలో వాహనాల పార్కింగ్ ఇష్టానుసారంగా ఉన్న వైనంపై 'ఈనాడు'లో వచ్చిన వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. దీనదయాళపురం నుంచి చినగదిలి సాయిబాబా దేవాలయం వరకు ఫుట్‌పాత్‌పై అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను క్రమపద్ధతిలో పెట్టారు. అలాగే సాయిబాబా దేవాలయం నుంచి హనుమంతువాక వరకు బుధవారం నుంచి డ్రైవ్ నిర్వహించి సమస్య లేకుండా చూస్తామని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.


నడకదారుల్లో వాహనాలను క్రమపద్ధతిలో పెడుతున్న ట్రాఫిక్ పోలీసులు

కళాకారుడిని అభినందించిన కేంద్రమంత్రి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఉత్తరాంధ్ర నుంచి అద్భుతమైన కళాకారులు రావటం శుభపరిణామమని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో విశాఖ నగరానికి చెందిన మిల్లెట్ కళాకారుడు మోక విజయ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన రామ్మోహన్‌నాయుడు చిత్రాన్ని విజయ్‌కుమార్ కేంద్రమంత్రికి అందించారు.


కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి చిరుధాన్యాలతో వేసిన చిత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

ఆకర్షణీయంగా విభాగిని

ఆరిలోవ, న్యూస్‌టుడే : చినగదిలి ప్రాంతం బీఆర్టీఎస్ మార్గం విభాగినులపై పూల మొక్కలు నాటారు. రెండు నెలలు క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో పచ్చదనంతో విభాగినులు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇప్పటివరకు ముడసర్లోవ, చినగదిలి ప్రాంతంలో నాటారు. హనుమంతువాక నుంచి శ్రీకృష్ణాపురం వరకు కూడా మొక్కలు నాటుతామని జీవీఎంసీ హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావు తెలిపారు. విభాగినులపై పశువులు తినని మొక్కలు పెంచుతున్నామన్నారు. ఇవి 5 అడుగుల ఎత్తువరకు పెరుగుతాయన్నారు.


విభాగినులపై ఆకర్షణీయంగా పచ్చని మొక్కలు

భారతీయ సంగీతం ఎంతో విశిష్టమైనది

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారతీయ శాస్త్రీయ సంగీతం, కళలు, ఎంతో విశిష్టమైనవని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఏయూ సంగీత నృత్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఏయూ సంగీత విభాగం 35వ, నృత్య విభాగం 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఈ సదస్సులు నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. మానవుడి జన్మ సంగీతం, నృత్యంతో ఆరంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ప్రముఖ నాట్యాచార్యులు హరిరామమూర్తి, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఏబీ బాలకొండలరావు, విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ, ఆచార్య కె.సరస్వతి విద్యార్థి తదితరులు ప్రసంగించారు.


సదస్సులో మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

చదువుతో పాటు బాధ్యత ఉండాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నేటి యువతకు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత కూడా ఉండాలని ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య హరినాథ్ అన్నారు. మంగళవారం ఎంవీపీకాలనీ సమతా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల డీన్ విజయా రవీంద్ర, డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు రాజేష్‌కుమార్, రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హరినాథ్, తదితరులు

వ్యాయామ పరికరాలు శివాజీపార్కుకి తరలింపు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ఓ అపార్టుమెంట్‌లో ఉన్న వ్యాయామ పరికరాలను పోలీసులు నగరంలోని శివాజీపార్కుకు తరలించారు. ఎంవీపీ నేరవిభాగ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరులోని ఓ అపార్టుమెంట్‌లోని సెల్లారులో పబ్లిక్ జిమ్‌కు సంబంధించిన వ్యాయామ పరికరాలు ఉన్నాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో స్పందించిన ఏడీసీపీ మోహన్‌రావు, సి.ఐ. బంగారుపాప అపార్టుమెంట్‌కు వచ్చి అసోసియేషన్ సభ్యులతో మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా అవి ఉన్నాయని చెప్పడంతో మంగళవారం వ్యాయామ పరికరాలు శివాజీపార్కుకు తరలించారు. అయితే ఎలాంటి కేసు నమోదు చేయలేదని సి.ఐ బంగారుపాప తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో భాగంగా రామ్‌నగర్‌లో తెదేపా నాయకులు, జీవీఎంసీ సిబ్బంది స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ జరిపారు. వీధులను శుభ్రం చేశారు. తెదేపా నాయకులు నక్కా కనకరాజు, తదతరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ఆర్టీసీ అధికారులు కార్మికులపై చిన్నచూపు చూసి వేధింపులకు గురిచేస్తే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టిన గతే పడుతుందని నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హెచ్చరించారు. వాల్తేరు డిపోలో మంగళవారం సాయంత్రం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విష్ణుకుమార్‌రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్.ఎం.యు.ఎ. రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ఇబ్బంది పెడితే క్షమించేది లేదన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, వాల్తేరు డిపో సెక్రటరీ వసంతరావు, అధ్యక్షులు పి.జి.పతి, వివిధ డిపోల నుంచి యూనియన్ నాయకులు హాజరయ్యారు.

మురళీనగర్, న్యూస్‌టుడే

సమస్య : జాతీయ రహదారి సేవా మార్గం బిర్లాకూడలికి చేరే రహదారిలో ఎన్నో రోజులుగా రోడ్డు మధ్యలో గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దదిగా మారి వాహనదారుల రాకపోకలకు అవరోధంగా ఉంటోంది. – స్థానికులు

సమాధానం: సమస్యను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. – జీవీఎంసీ అధికారి

కార్పొరేషన్, న్యూస్‌టుడే

సమస్య : ద్వారకానగర్ వి హోటల్ సమీపంలోని ఓ అపార్టుమెంటు ముందు ఉన్న కాలువలో స్థానికులు చెత్త వేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. – స్థానికులు

సమాధానం: కార్మికులను పంపించి కాలువను శుభ్రం చేయిస్తాం. – వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య : 41వ వార్డు జ్ఞానాపురం వడిచెర్ల వీధిలో వరుసగా నాలుగు వీధి దీపాలు వెలగడంలేదు. – స్థానికులు, వడిచెర్లవీధి

సమాధానం: త్వరలో మీ ప్రాంతంలోని వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – సతీష్, ఏఈ – అల్లిపురం, న్యూస్‌టుడే

అన్న క్యాంటీన్లకు ఆదరణ

బారులు తీరుతున్న ప్రజలు

నిరుపేదలకు పట్టెడన్నం తక్కువ ధరకు అందించే లక్ష్యంతో నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లకు ఆదరణ లభిస్తోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ప్రజలు ఇవి అందుబాటులోకి రావడంతో బారులు తీరుతున్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు సరఫరా చేస్తుండగా, సిబ్బంది వాటిని ప్రజలకు అందిస్తున్నారు. అన్న క్యాంటీన్లకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.



ఆర్అండ్‌బీ అన్న క్యాంటీన్ వద్ద ప్రజలు

మాధవధార, న్యూస్‌టుడే

ఇక్కడ భోజనం చేసేందుకు వచ్చిన వారికి రూ.5కి టోకెన్లు జారీ చేస్తున్నారు. ఈ టోకెన్ ఇచ్చిన వారికి వారు నిర్ణయించిన పరిమాణంలో ఆహారం అందిస్తున్నారు. ఇక్కడే తినాలి. ఉత్తర నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ వద్ద, తాటిచెట్లపాలెం వైఎస్‌ఆర్ కాలనీలో, సీతమ్మధార ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి రోజు అల్పాహారం 350 మందికి, మధ్యాహ్నం భోజనం 400 మందికి, రాత్రి భోజనం 350 మందికి అందుబాటులో ఉంచుతున్నారు. డిమాండ్‌ను బట్టి ఆహారం సరఫరా చేస్తున్నారు. అన్న క్యాంటీన్లలో జరుగుతున్న కార్యకలాపాలను నిత్యం పరిశీలించుకునేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చారు. ఒక పూట జారీ చేసిన టోకెను అదే సమయంలో ఉపయోగించుకోవాల్సి ఉంటోంది. అన్ని రకాల సదుపాయాలు కల్పించటంతో నిరుపేదలు భారీగా చేరుకొని భోజనాలు చేస్తున్నారు.

పని వేళలు


ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు అల్పాహారం. మధ్యాహ్నం భోజనం 12.30 నుంచి 3 గంటల వరకు. రాత్రి భోజనం 7.30 నుంచి 9 గంటల వరకు. వారంలో ఒక రోజు ప్రత్యేక భోజనం వడ్డిస్తారు. ఆదివారం సెలవు.

కడుపు నిండా భోజనం



అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు కడుపు నిండా భోజనం దొరుకుతుంది. ఎంతో నాణ్యంగా, రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. వీటితో పేదలకు ఆకలి బాధలుండవు. –డి.లక్ష్మి, శ్రీరామ్‌నగర్, ఆర్అండ్‌బీ.

ఆకలి తీరుతోంది



నేను ప్రతి రోజు పనికి వెళ్తాను. గతంలో కూడా అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేవాడిని. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇచ్చిన ప్రకారం మాలాంటి పేదలకు భోజనం పెట్టడంతో ఆకలి తీరుతోంది. ఇక్కడ వడ్డిస్తున్న పదార్థాలు రుచికరంగా ఉన్నాయి. –కె.రమణ, మర్రిపాలెం.

క్యాంటీన్ల మెనూ ఇలా..

అల్పాహారం: ఇడ్లీ, చట్నీ, పొడి, సాంబారు, పూరీ, కుర్మా/ఉప్మా మిక్చర్/పొంగల్, మిక్చర్

భోజనం: అన్నం, కూర, పప్పు, సాంబారు, పెరుగు, పచ్చడి

రకం	గ్రాములు
అన్నం	400
కూర	100
సాంబారు	150
మిక్చర్	25
పప్పు–సాంబారు	120
పచ్చడి	15
పెరుగు	75

అక్టోబర్ 2న మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్


టోర్నమెంట్ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

సీతంపేట, న్యూస్‌టుడే : అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ సారథ్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షులు ఎం.డి.యాసిన్ బాబా తెలిపారు. పురుషులు, మహిళలు డబుల్స్ విభాగాలుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు 22రోటరీ క్లబ్‌లకు చెందిన 48 బృందాలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని చెప్పారు. విశాఖ రైల్వే ఇండోర్ స్టేడియంలో జరగనున్న మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సుమారు వెయ్యిమంది రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. ఈటోర్నమెంట్ ద్వారా సేకరించిన నిధులను రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ పోలియో నిధికి అందిస్తామని తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బి.భాస్కరరావు, రోటరీ సభ్యులు కె.ఎం.కె.రమేష్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీబీకి ఘన నివాళి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: గాన గంధర్వులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం మృతి తీరని లోటని రైల్వే కబడ్డీ శిక్షకుడు కబడ్డీ శ్రీను పేర్కొన్నారు. మంగళవారం దొండపర్తిలోని శర్మ ఆప్టికల్స్ వద్ద ఎస్.పి.బాలు వర్ధంతిని దొండపర్తి ఎస్.పి.బాలు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాలు అభిమాన సంఘం సభ్యులు శర్మ ఆప్టికల్స్ వాసు, వెంకి, సాయి, సంతోష్, శ్రీను, శంకర్, మురళి, జి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.


ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

26న దివ్యాంగులకు ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే : దివ్యాంగులకు ఉద్యోగ మేళా ఈనెల 26న ఉదయం పది గంటలకు జరగనుంది. ఏయూ మైదానం, ఏయూ హైస్కూల్, ఏయూ కన్వెన్షన్ సెంటరు వద్ద అభ్యర్థులు హాజరుకావచ్చు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. అభ్యర్థులు బయోడేటా, వైకల్యం పత్రాలతో హాజరుకావాలి. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ, నేషనల్ దివ్యాంగజన్ ఫైనాన్స్ డెవలప్‌మెంటు కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీసుసెంటరు ఎస్టీ, ఎస్సీ, వికలాంగుల సాధికార విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరగనున్నదని నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరు ప్రాంతీయ ఉపాధి అధికారి ఎన్.శ్యామ్‌సుందర్ తెలిపారు.

నేడు జనసేన ఆధ్వర్యంలో మహాయజ్ఞం

డాబాగార్డెన్స్(కార్పొరేషన్), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూలో జరిగిన అపచారాన్ని క్షమించాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ భవనం సమీపంలో మహాయజ్ఞం నిర్వహించనున్నారు. సంబంధిత ఏర్పాట్లను దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం రాత్రి పరిశీలించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న దీక్షకు మద్దతుగా తాము ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు వంశీకృష్ణ తెలిపారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

రక్తదాన శిబిరానికి స్పందన

డాబాగార్డెన్స్ (కార్పొరేషన్): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 122 మంది విద్యార్థులు పాల్గొని రక్తం దానం చేశారు. విశాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ కడారి కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎస్వీ బాబ్జీ, జాతీయసేవా పథకం అధికారి భాస్కరరావు పాల్గొన్నారు.


రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు


గంగన్ననగర్‌లో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఈతలపాక సుజాత


కరపత్రాలు పంచుతున్న కూటమి సభ్యులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : గత ప్రభుత్వంలో అనర్హులు సంక్షేమ పథకాలు పొందేవారని, ఇప్పుడు అలాంటివి జరగవని, రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత పేర్కొన్నారు. 55వ వార్డు గంగన్ననగర్‌లో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా వార్డు తెదేపా నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వార్డు అధ్యక్షులు జి.వీరుబాబు, చైతన్య, శోభన పాల్గొన్నారు.

మాధవధార, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని 53వ వార్డు మాజీ కార్పొరేటర్ పోలమశెట్టి నర్సకుమారి పేర్కొన్నారు. మంగళవారం 53వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి వివరించి, స్టిక్కర్లను అతికించి, కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తీరుపై అడిగి తెలుసుకున్నారు.


53వ వార్డులో కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ పి.నర్సకుమారి

మురళీనగర్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని 49వ వార్డులో మంగళవారం నిర్వహించారు. వార్డు తెదేపా ప్రధాన కార్యదర్శి సంగు వాసు, మురళీశేఖర్, జనసేన అధ్యక్షులు శ్రీధర్, పవన్‌సునీల్, భాజపా నాయకులు ఒమ్మి నారాయణరావు, జగదీష్ ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను కాలనీవాసులకు వివరించారు.

రక్తదాన శిబిరం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రామకృష్ణానగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద బండి కన్నా వారి టీం ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం మండపం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న జన సైనికులు

సగం సగం పనులతో ఇక్కట్లు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

నలభై రెండో వార్డు రైల్వేన్యూకాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు స్థానికులను వేధిస్తున్నాయి. అందమైన రోడ్లను వివిధ అభివృద్ధి పనుల కోసం ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. రైల్వేన్యూకాలనీ మార్కెట్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఈ ప్రాంతంలో శిథిలమైన డ్రైనేజీలను మరమ్మతులు చేసేందుకు జీవీఎంసీ అధికారులు రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఇందుకోసం పాత డ్రైనేజీలను ఒక ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా తవ్వేయడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. కొంత భాగం డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసినా వాటిపై శ్లాబులు, మ్యాన్‌హోల్ పైకప్పులు వేయని కారణంగా స్థానిక ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ రోడ్డులో దుకాణాల ముందు ఇష్టానుసారంగా తవ్వేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో రహదారులు గోతులమయంగా ఉన్నాయి. ఈ కారణంగా ఇటువైపు వెళ్లే పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో డ్రైనేజీల మరమ్మతులు పేరుతో రోడ్డును సగం వరకు మూసివేడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో ఇటీవల నగరంలో భారీ వర్షాలు కురిసినప్పుడు స్థానికులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో అధికారులు కొన్ని చోట్ల పూర్తయిన డ్రైనేజీపై శ్లాబులు వేయించి ద్విచక్ర వాహనాలు, పాదచారులు వెళ్లేందుకు అనువుగా ఉండేలా చేశారు. దీంతో పరిస్థితి కొంత మెరుగు పడిందని, లేదంటే పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ


రాళ్లతో అధ్వానంగా తయారైన రైల్వేన్యూకాలనీ మార్కెట్ రోడ్డు

దారులపై గుంతలు.. చోదకుల బెంబేలు

ఫోకస్

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

దక్షిణ నియోజకవర్గంలో ధ్వంసమైన రహదారులను వైకాపా ఐదేళ్ల పాలనలో ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మరమ్మతులు చేసే లోపు భారీ వర్షాలు పడడంతో ఆయా రహదారులు మరింత అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. ముఖ్యంగా చావలమదుం రైల్వే వంతెన కింద ఉన్న రహదారి, పూర్ణమార్కెట్ నుంచి కొత్తరోడ్డుకు వెళ్లే మార్గం, రామకృష్ణ కూడలిలోని పెట్రోల్ బంకు వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. చావలమదుం రహదారిపై భారీ గుంతలు ఏర్పడాయి. వీటి మరమ్మతులకు జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎస్ఈ స్థాయి అధికారులు ఆమోదం తెలియజేయకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదు. జోన్-4 ఇంజినీరింగ్ అధికారులు రహదారుల మరమ్మతులపై కనీసం క్షేత్రస్థాయి పరిశీలన కూడా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో చీకటి పడితే ప్రధాన రహదారుల్లో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం వేగంగా వెళ్లినా, ఆదమరిచి వాహనాలు నడిపినా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జోన్-4 జోనల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలమయంగా టౌన్‌కొత్తరోడ్డు మార్గం


రామకృష్ణ కూడలిలోని పెట్రోల్ బంక్ వద్ద..


చావలమదుం రైల్వేవంతెన కింద..

సంక్షేమ పథకాల పునరుద్ధరణ హర్షణీయం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ముస్లిం మైనారిటీలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడం హర్షణీయమని తెదేపా రాష్ట్ర మైనారిటీ కమిటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ చిన రెహమాన్ అన్నారు. తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మైనారిటీల సంక్షేమానికి పలు కార్యక్రమాల అమలు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ రహమతుల్లా మాట్లాడుతూ కడప హజ్ భవనం నిర్మాణంతోపాటు, నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం మైనారిటీల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేల గౌరవ వేతనం, వక్ఫ్‌భూముల అభివృద్ధి, మసీదుల నిర్వహణ, హజ్ యాత్రికులకు రూ.లక్ష నిధులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. సమావేశంలో మైనారిటీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ అనీఫ్, మహమ్మద్ జఫ్రుల్లా, కాలేషా, అక్బర్ అలీ, షేక్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్దుల్ చిన రెహమాన్

భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాతనగరంలో ఆరేళ్ల కిందట రూ.7కోట్లతో అభివృద్ధి చేసిన పురాతన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. భవనాల్లో మొక్కలు మొలిచాయని, వ్యర్థాలు పేరుకుపోతున్నాయని తెలిపారు. వాటిని వినియోగంలోకి తెస్తే జీవీఎంసీకి ఆదాయం సమకూరుతుందని సూచించారు. వార్డులో చాలా మందికి టిడ్కో ఇళ్లు కేటాయించకుండా డీడీలను తిరిగి ఇస్తున్నారని, అటువంటి వారి అర్హతలను తిరిగి పరిశీలించాలని కోరారు. 38వ వార్డులో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి

మత్స్యకారులకు వైద్య శిబిరం

జగదాంబకూడలి(కార్పొరేషన్), న్యూస్‌టుడే: వేదాంత-వీజీసీబీ పోర్టు ఆధ్వర్యంలో పాతనగరం మత్స్యకారుల సామాజిక భవనంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వేదాంత సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తారన్నారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ మాట్లాడుతూ వేదాంత సంస్థ రానున్న రోజుల్లో మత్స్యకారుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వీజీసీబీ పోర్టు సీఈఓ సతీష్‌కుమార్, మత్స్యకార నాయకులు కదిరి అప్పారావు, శిరీన్ రెహమాన్, స్థానిక నాయకులు చిన్న, దానేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

స్వయం ప్రతిపత్తికి అర్హతల పరిశీలన

డాబాగార్డెన్స్ (కార్పొరేషన్), న్యూస్‌టుడే: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అకడమిక్ కౌన్సెల్ సమావేశం ప్రిన్సిపల్ ఆర్.మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఏయూ సైన్స్, టెక్నాలజీ విభాగ అసిస్టెంట్ ప్రిన్సిపల్ ఆచార్య అనురాధ కామేశ్వరి, ఆచార్య సంధ్యా దీపిక, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ పీఎల్ శరణ్య మాట్లాడుతూ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడానికి అవసరమైన అన్ని వసతులున్నాయని వివరించారు. గత సమావేశంలో ప్రతిపాదించిన పలు అంశాలను ధ్రువీకరించాలని సభ్యులను కోరారు.


కౌన్సెల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం



దస్త్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

సచివాలయంలో తనిఖీలు

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస సచివాలయాన్ని మంగళవారం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. జీవీఎంసీ మంజూరు చేసిన ధ్రువపత్రాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలపై ఆరా తీశారు. ప్రజలకు సత్వర సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి, సచివాలయం సిబ్బంది కోమలి, పరమేశ్వరరావు, లావణ్య పాల్గొన్నారు.

వినాయకుని అనుపోత్సవం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: వినాయక చవితి ఉత్సవాల ముగింపు వేడుకలను బాగుంగా మంగళవారం రాత్రి గణపతి నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నెల్లిముక్కు, సీతానగరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కోలాటాలు, సాముగరిడీలు, నేమేపాలతో ఊరేగింపు జరిపారు. తెదేపా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వేడుకలో ఉత్సవ కమిటీ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక

సమస్య : గాజువాక బీసీరోడ్డు దరి సీతారామ్‌నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. –చిన్నారావు, సీతారామ్‌నగర్

✔: సిబ్బందిని పంపి దీపాలు వెలిగేలా చూస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

ప్రైవేట్ పనులు — స్పందనకు వందనం

కదలిక: పెదగంట్యాడ సమీప నడుపూరులో నిలిచిపోయిన ప్రైవేటు పనులను ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇక్కడి సమస్యపై 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. నడుపూరు, మంచమాంబకాలనీలో పనులు పునఃప్రారంభించారు. –న్యూస్‌టుడే, పెదగంట్యాడ



వాలీబాల్ ఆడుతున్న బాలురు

క్రీడోత్సాహం..!

పాఠశాల సమాఖ్య ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభం

న్యూస్‌టుడే, గోపాలపట్నం: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య (స్కూల్ గేమ్ ఫెడరేషన్ - ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు ప్రారంభించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయికి, ఆ తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. గోపాలపట్నం మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది. విద్యార్థులకు వయసు, విద్యార్హత నిర్ధారించే ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలి.

ఇదీ అర్హత.. 01-01-2011 తర్వాత జన్మించిన బాల, బాలికలు అండర్-14 పోటీల్లో, 01-01-2008 తర్వాత పుట్టినవారు అండర్-17 పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

క్రీడాంశాలు : ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్, త్రోబాల్

తేదీలు : 24, 25న మండల స్థాయి, 27, 28న నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తారు.

పాఠశాలలు- ప్రాంతాలు : గోపాలపట్నం, వెంకటాపురం, కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, కప్పరాడ, కంచరపాలెం, ఆర్టీపేట

"మంగళవారం నిర్వహించిన అండర్-14, -17 బాలుర విభాగంలో 13 పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు." – నత్యకళ, పీడీ, గోపాలపట్నం పాఠశాల



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు



గాజువాకలో మాట్లాడుతున్న మన్నాజీ

బాల్యం నుంచే క్రీడాసక్తి

గాజువాక, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎం.మన్నాజీ అన్నారు. మంగళవారం గాజువాక హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాలల్లో క్రీడాస్ఫూర్తి పెంచడానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయని మన్నాజీ అన్నారు. బుధవారం నియోజకవర్గం స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. హెచ్‌ఎం విజయప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెం, మల్కాపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించాలని, వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని మంగళవారం పలువురు కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతులు అందించారు.

"జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారి, సిద్ధార్థనగర్ వద్ద ఉన్న 4.30 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించి, సిద్ధార్థనగర్ నుంచి అప్పికొండ కాపులప్పాడ వరకు ఉన్న గెడ్డను ఆధునికీకరించాలి. ఎన్టీఆర్‌కాలనీ, శ్రీనివాస మధ్యలో ఉన్న కాలువతో పాటు, స్థానికంగా సామాజిక భవనాలు, రహదారులు నిర్మించాలి." –వి.జగన్, కార్పొరేటర్

"జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ వాంబే గృహాల్లో తాగునీటి సమస్య పరిష్కరించి, యారాడ ఘాట్‌రోడ్డు, కాకరలోవ కొండవాలుపై రక్షణ గోడ, ఏకేసీకాలనీలో రోడ్డు, సామాజిక భవనం నిర్మించాలి." –జి.నాగేశ్వరరావు, కార్పొరేటర్

సంక్షిప్త సమాచారం..

● నేటి నుంచి పవిత్రోత్సవాలు



అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి శాంతినగర్ కాలనీ శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఇ.కె.చారి తెలిపారు. అయిదు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

● బాధ్యతల స్వీకరణ



అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే : గాజువాక సబ్ రిజిస్ట్రార్‌గా టి.తారకేశు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి ఆయన బదిలీపై గాజువాక వచ్చారు. ఇన్నాళ్లు ఇక్కడ విధులు నిర్వహించిన కె.రాజు బదిలీపై నెల్లిమర్ల వెళ్లారు.

● కళాశాలకు కుర్చీలు అందజేత

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆశరాజ్ షైనింగ్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం పది కుర్చీలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.సుధాకర్‌బాబు, సొసైటీ కార్యదర్శి పి.ఆశాలత, ఉపాధ్యక్షుడు జి.వరప్రసాదం, స్థానిక స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● శివశంకర్‌కు అభినందనలు

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : ఏపీ ఎంఎస్‌ఎంఈ డీసీ (ఆంధ్రప్రదేశ్ లఘు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ) ఛైర్మన్‌గా నియమితులైన జనసేన నాయకుడు తమ్మిరెడ్డి శివశంకర్‌ను ఆ పార్టీ నాయకులు అభినందించారు. మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో గాజువాక పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పి.రామకృష్ణ, జి.నరసింహమూర్తి, నరసింహారెడ్డి, దయాకర్, పవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● నూతన నియామకంపై హర్షం

సింధియా, న్యూస్‌టుడే : ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యురాలిగా విశాఖ పశ్చిమం జనసేన పార్టీ సమన్వయకర్త, పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అంగ దుర్గాప్రశాంతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఆమెను అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.

● విద్యార్థులకు దంత పరీక్షలు

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం వి.డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని కళాశాల కార్యదర్శి డాక్టర్ వి.రామారావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ ప్రారంభించారు. వైద్యసిబ్బంది హాజరై విద్యార్థులకు పరీక్షలు చేసి, దంత సంరక్షణపై సూచనలు చేశారు. కళాశాల ఇన్‌ఛార్జి తేజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు ఎస్‌వీ కృష్ణ, శ్రీనివాస్, ఈశ్వరరాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పరవాడలో భారీ వర్షం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో మంగళవారం రాత్రి 7 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపైన నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇక్కట్లకు గురయ్యారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సంక్షేమ పాలనకే ప్రాధాన్యం : తెదేపా



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, పెదగంట్యాడ, గోపాలపట్నం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 66, 73వ వార్డులోని సీతారామ్‌నగర్, సింహగిరికాలనీల్లో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో నిర్వహించిన ప్రత్యేక సమావేశాలకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ, కూటమి నాయకులు మహ్మద్ రఫీ, గోమాడ వాసు, ప్రసాదుల శ్రీనివాస్, పాలరౌతు వెంకటరమణ, పుచ్చ విజయకుమార్, నాగేశ్వరరావు, ఎండీ ముర్తజా పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 58వ వార్డులో అన్నపూర్ణనగర్‌లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడారు. జీవీఎంసీ ఏపీడీ చిరంజీవి, డీఈ ఏడుకొండలు, ఏఈలు సత్యనారాయణ, బాబూరావు, ఉషారాణి, కూటమి నాయకులు విశ్వనాథుల దినకర్, కోరాడ శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి, అంగ దుర్గాప్రశాంతి, పోతాబత్తుల శ్రీను, నరసింగరావు పాల్గొన్నారు.



అన్నపూర్ణనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

"ప్రజా సంక్షేమ పాలనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. 100 రోజుల పాలన ద్వారా పేదలకు చేరువయ్యాం. వైకాపా పాలన నుంచి విముక్తి లభించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు." –పల్లా

"ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపావళి నుంచి మహిళలకు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. 100 రోజుల్లోనే అన్న క్యాంటీన్ల ఏర్పాటు, పింఛన్ల పెంపు.. తదితర హామీలు అమలు చేశాం." –ఎమ్మెల్యే గణబాబు

"జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో బుధవారం ఉదయం ఏర్పాటు చేసే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలి". –డి.వి.రమేశ్, కార్పొరేటర్

పర్యావరణం, పరిశుభ్రతపై అవగాహన



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఐఎంయూ విద్యార్థులు

సింధియా, న్యూస్‌టుడే: ఇండియన్ మారిటైం యూనివర్సిటీ గాంధీగ్రాం బ్రాంచిలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని శ్రమదానంతో పాటు, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. క్యాంపస్ విభాగం అధిపతి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది సెప్టెంబరు 17న మొదలైన స్వచ్ఛ కార్యక్రమాలను అక్టోబరు ఒకటో తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. 'స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' నినాదంతో పర్యావరణం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటించారు.

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక చైతన్య మహిళా కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు శ్రమదానం చేశారు. బాలికలు బృందాలుగా వీడి చైతన్యనగర్ రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త కుప్పలు తొలగించారు. ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

గాజువాక, న్యూస్‌టుడే : తిరుమలనగర్ ఏసుక్రీస్తు మందిరం వ్యవస్థాపకుడు శీలం జక్కరయ్య జన్మదినం సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను సామాజికవేత్త జొన్నకూటి విజయకుమార్ అభినందించారు. చర్చి సభ్యులు కుమారి, అవినాశ్, రాబర్ట్ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిరక్షణ



శిబిరంలో కూర్చున్న కార్మిక నాయకులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఆర్థిక సంక్షోభం నుంచి ఉక్కును కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావాలని పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో కొనసాగుతున్న రిలే దీక్షలు మంగళవారం 1321వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో ఉక్కు పరిరక్షణకు అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేపడతామన్నారు. ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, జె.నరేష్‌కుమార్, చీకటి శ్రీనివాస్, కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కరవు : సిటూ

సింధియా, న్యూస్‌టుడే: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో ప్రమాదకర పనులు చేపట్టే ఒప్పంద కార్మికులకు భద్రత కరవైందని మల్కాపురం సిటూ జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ఆరోపించారు. మంగళవారం ఉదయం రిఫైనరీ గేటు వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. సంస్థలో జరుగుతున్న షట్‌డౌన్ పనుల ప్రదేశాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఒప్పంద కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈనెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపడతామన్నారు. అనంతరం ధర్నా గోడపత్రికలు విడుదల చేశారు. సిటూ సభ్యులు కె.పెంటారావు, ఎం.కృష్ణారావు, బి.శ్రీను, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రిఫైనరీ గేటు వద్ద గోడపత్రికలు ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఆరోగ్యంపై ముందు చూపు ఉంటే ప్రాణాంతక వ్యాధులు దరి చేరవని యాక్సిస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, యాక్సిస్ట్ సీసీ సంస్థ ఆధ్వర్యంలో బీసీ గేటు వద్ద 'మీకు తెలుసా' పేరుతో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. వలస కార్మికులు హెచ్ఐవీ, ఎయిడ్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సిబ్బంది కోదండ, ప్రసాద్, లత, గీత, భాస్కర్, మోహన్, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : వృత్తి విద్య కోర్సులు అభ్యసించే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కుతాయని పలువురు సూచించారు. గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు మంగళవారం ఆటోనగర్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమను సందర్శించారు. హెచ్‌ఎం విజయ ప్రశాంతి, ఒకేషనల్ కోర్స్ సమన్వయకర్త సుధాకర్, వృత్తి విద్య శిక్షకురాలు కందుల భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమ ప్రతినిధి నవరతన్ జైన్, సిబ్బంది పాల్గొన్నారు.



పరిశ్రమ సందర్శనకు వెళ్లిన విద్యార్థులు

నిలువ కాళ్లపై నిరీక్షణ..! — ఫోకస్

గోపాలపట్నం (సింహాచలం) రైల్వేస్టేషన్ నుంచి బయటకొచ్చే ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు నడిరోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. నిలువ నీడ లేక, కూర్చునే వీల్లేక... ఎండైనా, వానైనా.. అక్కడే వేచి ఉంటున్నారు. కనీసం సరిపడా స్థలం లేక చాలామంది ప్రమాదకరంగా విభాగినిపై నిలబడి ఉంటున్నారు. –ఈనాడు, విశాఖపట్నం



అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

గాజువాక, న్యూస్‌టుడే : అక్కిరెడ్డిపాలెం బీహెచ్‌పీవీ బస్‌స్టాపు వద్ద ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన అనాథ మహిళ(40)కు మంగళవారం గాజువాక మానవత సేవా సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి బంధువులెవరూ లేకపోవడంతో గాజువాక పోలీసులు ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపర్చారు. ఎస్ఐ సూర్యకళ సమాచారంతో మానవత ఛైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు స్పందించారు. సభ్యులు వి.శ్రీనివాసరావు, బి.సత్యారావు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రమం పొందిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటనపై మంగళవారం వసతి గృహం మేనేజర్ ఎ.మమత తెలిపిన వివరాలివి. ప్రసాద్‌రావు (60) అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి రహదారులపై తిరుగుతుండగా... రెండు నెలల క్రితం గృహానికి తీసుకొచ్చి సపర్యలు చేశారు. మెరుగైన వైద్యసేవలకు ఆసుపత్రిలో చేర్పించగా, ఈనెల 22న చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువులెవరూ రాకపోవడంతో జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు.



గాజువాక శ్మశానవాటికలో..

'మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం'

సింధియా, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు వీలుగా 1489 బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పేదల సొంతింటి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.4 లక్షల వరకు మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం విజయవాడ వరదల్లో విధులు చేపట్టిన పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, కానుకలు అందజేశారు. ఏపీడీ చిరంజీవి, డీఈ ఏడుకొండలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు కానుకలు అందించిన ఎమ్మెల్యే గణబాబు

రాత్రి గస్తీలో అప్రమత్తత



స్టేషన్‌లో సీపీ శంఖబ్రత బాగ్చీ

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక క్రైం పోలీస్‌స్టేషన్ను మంగళవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలపై ఆరా తీశారు. రాత్రి గస్తీలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సౌత్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐలతో సీపీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో 27న పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. –న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

గాజువాక సినిమాలు..

కన్య, శ్రీకన్య: సరిపోదా శనివారం
మినీమోహినీ, అరుణ, అన్నపూర్ణ: మత్తు వదలరా–2, మోహినీ: ట్రాన్స్‌ఫార్మర్–1, లక్ష్మీకాంత్: గొర్రె పురాణం
విశేష్: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ ది టైమ్
మోహినీ 70ఎంఎం: 100కోట్లు
లక్ష్మి: చిన్నకథ కాదు..
గోపాలపట్నంలో: శ్రీనరసింహా: చిక్లెట్స్
నరసింహా: సరిపోదా శనివారం
సౌజన్య: మత్తు వదలరా–2
సుకన్య: హైడెన్ సీక్
ఎస్టీబీఎల్‌లో..: స్క్రీన్-2: సరిపోదా శనివారం, స్క్రీన్-3: హైడెన్ సీక్
స్క్రీన్-4: మత్తు వదలరా–2

కుక్కలు... పిక్కలు పీకేస్తున్నాయ్..!



అగనంపూడి సమీప ఫార్మాసిటీ పునరావాస కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గుంపుగా స్వైర విహారం చేస్తున్న కుక్కలు.. స్థానికులను వెంబడించి గాయపరుస్తున్నాయి. పది రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు కుక్కకాటుకు గురయ్యారు. ఈ ఘటనతో రాత్రి సమయాల్లో బయటకు వచ్చేందుకు కాలనీవాసులు భయపడుతున్నారు. గత కొన్నాళ్ల నుంచి కుక్కల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంతతి విపరీతంగా పెరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మూలన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అగనంపూడి

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



ఆలయంలో పూజలు చేస్తున్న తాతారావు, తదితరులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సంప్రోక్షణ దీక్ష చేపట్టినట్టు జనసేన పీఏసీ సభ్యులు కోన తాతారావు తెలిపారు. మంగళవారం ఆయన నిర్వాసిత రాజులపాలెం కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి భక్తులు తిరుమల లడ్డూను ప్రసాదంగా స్వీకరిస్తున్నారని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా గత వైకాపా పాలకులు వ్యవహరించారని ఆరోపించారు. జనసేన నాయకులు గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, తోట ఇందిరాప్రియదర్శిని, కళావతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

26న దివ్యాంగులకు ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే : దివ్యాంగులకు ఉద్యోగ మేళా ఈనెల 26న ఉదయం పది గంటలకు జరగనుంది. ఏయూ మైదానం, ఏయూ హైస్కూల్, ఏయూ కన్వెన్షన్ సెంటరు వద్ద అభ్యర్థులు హాజరుకావచ్చు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. అభ్యర్థులు బయోడేటా, వైకల్యం పత్రాలతో హాజరుకావాలి. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికార మంత్రిత్వ శాఖ, నేషనల్ దివ్యాంగజన్ ఫైనాన్స్ డెవలప్‌మెంటు కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరు ఎస్టీ, ఎస్సీ, వికలాంగుల సాధికార విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరుగనున్నదని నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరు ప్రాంతీయ ఉపాధి అధికారి ఎన్.శ్యామ్‌సుందర్ తెలిపారు.

గోతులు.. ప్రయాణానికి ఇక్కట్లు..!



కూర్మన్నపాలెం ప్రధాన రహదారిలోని సీడబ్ల్యూసీ రోడ్డు అనుసంధాన కూడలిలో..

న్యూస్‌టుడే, కూర్మన్నపాలెం: ఇటీవల వర్షాలకు కూర్మన్నపాలెం, వడ్లపూడి ప్రధాన రహదారుల్లో రాళ్లు తేలి, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో పలువురు ద్విచక్ర వాహనచోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



కో-ఆపరేటివ్ స్టోర్ సమీపంలో..